
మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న రవికుమార్

తెలుగుదేశం పార్టీకి ఉమ్మడి జిల్లా ప్రజానీకం అద్భుతమైన ఆదరణ ఇవ్వగా అంతకు మించిన గౌరవం అధిష్ఠానం నుంచి లభించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు తన మంత్రివర్గంలో ఉమ్మడి జిల్లాలో ఇద్దరికి అవకాశం కల్పించారు. గత ఐదు దశాబ్దాల్లో ఇలాంటి అరుదైన రాజకీయ సన్నివేశం జిల్లాలో చోటుచేసుకోలేదు. గత వైసీపీ ప్రభుత్వంలో కొంతకాలం ఇద్దరు మంత్రులకు జగన్ అవకాశం ఇచ్చినా నాటి రాజకీయ పరిస్థితులు వేరు. ఆ ఎన్నికల్లో వైసీపీ ఎనిమిది స్థానాల్లో గెలుపొందగా, టీడీపీ నాలుగు స్థానాలను దక్కించుకుంది. అయితే ఈ పర్యాయం టీడీపీ పది స్థానాలు గెలవడం ఒక విశేషమైతే రెండు మంత్రి పదవులు దక్కడం గొప్ప విషయం. అందునా పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేస్తూ వరుస విజయాలు సాధిస్తున్న గొట్టిపాటి రవికుమార్, స్వామికి అవి లభించడం ప్రత్యేకం. దీనిపై టీడీపీ శ్రేణుల్లోనే కాక యావత్తు ప్రజానీకంలోనూ పూర్తిస్థాయిలో సానుకూలత వ్యక్తమవుతోంది. ప్రత్యేకించి టీడీపీ ఎమ్మెల్యేలు పది మంది, ఆ పార్టీ ఎర్రగొండపాలెం, దర్శి నియోజకవర్గాల ఇన్‌చార్జిలు బుధవారం సాయంత్రం అమరావతిలో కలిసి సంబరాలు చేసుకోవడం అందుకు దర్పణంగా చెప్పుకోవచ్చు.


మంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్న స్వామి

అరుదైన గౌరవం

జిల్లాకు రెండు మంత్రి పదవులు

- ప్రజాదరణకు తగ్గ అవకాశం
- టీడీపీలో ఒకే కేబినెట్‌లో రెండు పదవులు ఇప్పుడే
- ప్రజాసంబంధాలు, నిబద్ధతకు పట్టం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఉమ్మడి ప్రకాశం జిల్లా ఏర్పాటుకు ముందు, ఆ తర్వాత అటు కేంద్రంలోకానీ, ఇటు రాష్ట్రంలో కానీ జిల్లా నుంచి 20 మంది మంత్రులుగా పనిచేశారు. జిల్లా ఏర్పాటుకు ముందు రోజుల్లో మంత్రులుగా పనిచేసిన వారిలో పిడతల రంగారెడ్డి, నల్లబోతు చెంచురామానాయుడు, కందుల ఓబుల్‌రెడ్డి, దివి కొండయ్యచౌదరి, వడ్డే నాగేశ్వరరావులాంటి వారు ఉన్నారు. టీడీపీ ఆవిర్భావం తర్వాత ఆ పార్టీ తరఫున కాటూరి నారాయణస్వామి, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, ముక్కు కాశిరెడ్డి, లక్ష్మీపద్మావతి, పాలేటి రామారావు, గొట్టిపాటి హనుమంతరావు, దామచర్ల ఆంజనేయులు, శిద్దా రాఘవరావులు మంత్రులుగా పనిచేశారు. కాంగ్రెస్ నుంచి జీవీ శేషు, గాదె వెంకటరెడ్డి, బాలినేని శ్రీనివాసరెడ్డి మంత్రులుగా వ్యవహరించారు. గత వైసీపీ ప్రభుత్వంలో మరోసారి బాలినేనితోపాటు ఆదిమూలపు సురేష్ మంత్రులుగా పనిచేశారు. ఈ మొత్తం సమయంలో మూడేళ్లపాటు మాత్రమే బాలినేని, సురేష్ ఇద్దరూ ఒకేసారి మంత్రులుగా ఉండగా చివరి రెండేళ్లు సురేష్ ఒక్కరే కొనసాగారు.

సమష్టిగా అభినందనలు

ఉమ్మడి జిల్లాలో ఈ ఇద్దరికీ మంత్రివర్గంలో అవకాశం లభించవచ్చని ముందు నుంచి వినిపిస్తోంది. అయితే పార్టీలో సీనియర్లు కావడమే కాక పార్టీ బాధ్యతలను మోస్తున్న దామచర్ల జనార్దన్, ఏలూరి సాంబశివరావులకు అవకాశం ఇస్తే బాగుండు అన్న అభిప్రాయం కూడా ఆ పార్టీశ్రేణుల్లో వినిపించింది. వివిధ అంశాలను దృష్టిలో ఉంచుకొని డాక్టర్ ఉగ్ర, బీఎన్ పేర్లు కూడా పరిశీలించినట్లు వార్తలొచ్చాయి. అయినప్పటికీ అనుకున్నట్లే రవికుమార్, స్వామికి అవకాశం లభించింది. అయితే టీడీపీలోని మిగిలిన ఎమ్మెల్యేలు తరతమబేధం లేకుండా ఇద్దరు మంత్రులను అభినందించారు. బుధవారం సాయంత్రం వారు కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. పార్టీ హామీ ఇచ్చినట్లు జిల్లాల విభజన విషయంలో ముందుకు సాగాలని నిర్ణయించుకున్నారు. అదే విషయాన్ని వారు ఆ సమావేశం అనంతరం ఒకేమాట 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

సముచిత నిర్ణయమే..

టీడీపీకి గతంలో ఎప్పుడూ ఇంతటి ఘనవిజయం జిల్లాలో లభించ లేదు. ఆ పార్టీ ఆవిర్భావం తర్వాత తొలిసారి జిల్లాలోని ప్రాంతాలతో సంబంధం ఉన్న అన్ని పార్లమెంట్ స్థానాలను టీడీపీ గెలుచుకుంది. అలాగే 1983, 1985, 1994లో లభించిన విజయాల కన్నా ఆపార్టీకి ఇదే అద్భుత విజయమని చెప్పవచ్చు. ప్రత్యర్థి పక్షమైన వైసీపీకి కంచుకోట లాంటి పశ్చిమప్రాంతలోనూ మూడు స్థానాలను గెలుచుకోవటంతోపాటు రెండు చోట్ల స్వల్ప తేడాతో మాత్రమే ఓడిపోయింది. ఇక పార్టీపరంగా చూసినా టీడీపీలో గతంలో ఎన్నడూ లేనంత ఐక్యత, సమష్టి పనితీరు గత ఐదేళ్లలోనే కనిపించింది. క్లిష్ట పరిస్థితుల్లో అసాధ్యం అనుకున్న మహానాడును ద్విగ్విజయంగా నిర్వహించి రాష్ట్రస్థాయిలో ఆపార్టీకి పూర్వవైభవం సంకేతాలను జిల్లా నాయకత్వం ఇవ్వగలిగింది. ఈ మొత్తం నేపథ్యంలోనే అధినేత జిల్లాకు రెండు మంత్రి పదవులు ఇచ్చి అరుదైన అవకాశం కల్పిచారని విశ్లేషకులు భావిస్తున్నారు.

శాఖలపై పట్టింపు లేదు

ఇటు గొట్టిపాటి, అటు స్వామి కూడా తమకు ఏ శాఖలు కేటాయిస్తారనే విషయానికి ప్రాధాన్యం ఇవ్వడం లేదు. బుధవారం సాయంత్రం వారు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ చంద్రబాబు ఏ పదవి ఇచ్చినా వాటికి న్యాయం చేయడమే మా బాధ్యత అని వెల్లడించారు. రవికుమార్‌కు గనులశాఖ లేక పరిశ్రమలు లేక చిన్ననీటి పారుదల శాఖల్లో ఒకటి లభించే అవకాశం ఉంది. స్వామికి ఎస్సీ సంక్షేమ శాఖ లేక వైద్యశాఖలో అవకాశం లేకపోలేదని అంచనా వేస్తున్నారు.

నిబద్ధతే గొట్టిపాటికి గీటురాయి...

జిల్లాలో టీడీపీ కూటమిలో గెలుపొందిన వారిలో కొత్తవారితోపాటు కొందరు సీనియర్ నాయకులూ ఉన్నారు. వీరినుంచి మంత్రులను ఎంపిక చేయడం కష్టమైన పనే. కానీ కొన్ని అంశాల్లో మారిన చంద్రబాబును చూస్తారని చెబుతున్న సీఎం తనదైన శైలిలో ఇద్దరిని తన మంత్రివర్గంలోకి తీసుకున్నారు. బలమైన ప్రజా సంబంధాలు, పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేయడమే గీటురాయిగా తీసుకున్నట్లు భావిస్తున్నారు. పార్టీతో రవికుమార్ సంబంధం తొమ్మిదేళ్లు మాత్రమే. అయితే ఆయన వరుసగా ఐదోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. తొలిసారి మార్టూరు నుంచి ఎన్నికైన ఆయన అద్దంకి నుంచి నాల్గోసారి గెలుపొందారు టీడీపీలో చేరిన తర్వాత జరిగిన రెండు ఎన్నికల్లోనూ అద్దంకిలో ఆయనదే విజయం. తద్వారా నియోజకవర్గ ప్రజలతో ఆయనకు ఉన్న బలమైన సంబంధాలు నిరూపితమయ్యాయి. ఇక గత ఎన్నికల్లో గెలుపొందిన తర్వాత జగన్ ప్రభుత్వం నుంచి తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 11 గ్రానైట్ క్వారీలు, రెండు పరిశ్రమలు మూతబడ్డాయి. ఇదే తరహా ఒత్తిళ్లకు గురైన కరణం బలరాం, శిద్దా రాఘవరావులు పార్టీకి గుడ్‌బై చెప్పినా రవికుమార్ మాత్రం టీడీపీలోనే కొనసాగారు. ఎలాంటి వివాదాలకు పోకుండా జిల్లాలోని పార్టీ నాయకులందరితో కలిసి నడవడంలో సఫలీకృతులయ్యారు. అటు చంద్రబాబు, ఇటు లోకేష్‌తోపాటు ఇతర ముఖ్య నాయకులతో సన్నిహిత సంబంధాలు కొనసాగించారు. ఈ పరిస్థితులన్నీ బేరీజు వేసుకొనే రవికుమార్‌కు మంత్రివర్గంలో స్థానం కల్పించినట్లుగా తలపండిన నాయకులు అంచనా వేస్తున్నారు.

నిత్య ప్రజా సంబంధాలతో ముందుకు సాగిన స్వామి

కొండపి ఎమ్మెల్యే స్వామి ప్రజాసంబంధాలతోపాటు నిబద్ధతగా ముందుకు నడవడంలో సఫలీకృతులయ్యారు. ప్రభుత్వ డాక్టర్ అయిన స్వామి దామచర్ల కుటుంబం సహకారంతో రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. తొలిసారి అటు ఎమ్మెల్యేగా ఇటు టీటీడీ సభ్యుడిగా ఎవరూ వేలెత్తిచూపని తరహాలో పాలనా వ్యవహారాలను సాగించారు. గత ఎన్నికల్లో గెలుపొందిన తర్వాత అసెంబ్లీ లోపలా, బయటా వైసీపీ ప్రభుత్వ వేధింపులను ధైర్యంగా ఎదుర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో సీఎం జగన్‌కు ధైర్యంగా ఎదురొడ్డి నిలిచారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ సాక్షిగా చేయిచేసుకున్నా తగ్గలేదు. చివరకు ఇంటిపై దాడికి ప్రయత్నించినా బెదరకపోగా పార్టీ విషయంలో రాజీలేని నడక సాగించారు. వీటికితోడు దామచర్ల కుటుంబం నుంచి ఆ నియోజకవర్గ బాధ్యతలు చూస్తున్న యువనాయకుడు సత్య పార్టీ రాష్ట్ర నాయకత్వంలో మన్ననలు పొందటం కూడా కలిసొచ్చింది.

బడి గంటలు

- నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం
- విద్యాకానుక పేరు స్టూడెంట్ కిట్‌గా మార్పు
- అడ్రస్ లేని యూనిఫాంలు, షూలు
- నాడు-నేడు పనులు అరకొరే



ఒంగోలు (విద్య), జూన్ 12 : వేసవి సెలవుల అనంతరం గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతున్నాయి. తొలిరోజే విద్యార్థులకు విద్యాకానుక కిట్లు అందజేస్తామని చెప్పిన గత ప్రభుత్వం ఆచరణలో విఫలమైంది. వారి నిర్లక్ష్యం కారణంగా అరకొరగానే పాఠ్యపుస్తకాలు జిల్లాకు వచ్చాయి. గత ప్రభుత్వం విద్యాకానుక పేరుతో విద్యార్థులకు అందించిన కిట్లకు ప్రస్తుత ప్రభుత్వం స్టూడెంట్ కిట్లుగా పేరు మార్చింది. జిల్లాలో 1 నుంచి 10 తరగతులు చదువుతున్న 1,93,440 మంది విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందిస్తున్నారు. అందుకుగాను ఇండెంట్ ప్రకారం వస్తువులు ఇప్పటి వరకూ సరఫరా కాలేదు. జిల్లాలో 38 మండలాలకుగాను 27 మండలాలకు సరఫరా చేశారు. 11 మండలాలకు ఒక్క బ్యాగును సరఫరా చేయలేదు. బెల్టులు 1,37,685గాను 84,026 మాత్రమే వచ్చాయి. వీటిని 24 మండలాలకు సరఫరా చేశారు. నోటు పుస్తకాలు మాత్రం పూర్తిస్థాయిలో సరఫరా చేశారు. 1,93,298 మందికి షూలు, యూనిఫాంలు, 23,914 మందికి ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు, 16,672 మందికి పిక్టోరియల్ డిక్షనరీలు జిల్లాకు రాలేదు.

అరకొరగానే పాఠ్యపుస్తకాలు

జిల్లాలో 1 నుంచి 10వ తరగతి వరకు మొత్తం 16,30,676 పాఠ్య పుస్తకాలు ఉచిత పంపిణీకి ఇండెంట్ పెట్టారు. 1 నుంచి 7 తరగతులకు 9,30,010 పాఠ్యపుస్తకాలకుగాను సుమారు 8లక్షలు వచ్చాయి. ఇప్పటివరకూ ఆరు పుస్తకాలను మండలాలకు సరఫరా చేశారు. గోడౌన్‌లో ఇప్పటికే 1.5లక్షల పుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉండగా ప్రభుత్వం నుంచి ఇంకా లక్ష రావాల్సి ఉంది. 8,9,10 తరగతులకు 7,00,666 పాఠ్యపుస్తకాలకు ఇండెంట్ పెట్టగా 6.8 లక్షలు సరఫరా చేశారు. 10వ తరగతి ఫిజికల్ సైన్స్ 20,776గాను 2,600 సరఫరా అయ్యాయి. మిగిలినవి రావాల్సి ఉంది. 7వ తరగతి ఇంగ్లీషు, హిందీ, సోషల్, 5వతరగతి తెలుగు, గణితం, 3వ తరగతి ఇంగ్లీషు పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉంది. పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించేందుకు నాడు-నేడు పనులు నత్తనడకన నడుస్తున్నాయి. పాఠశాలల పునఃప్రారంభమవుతున్నా పనులు పూర్తికాకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పని పరిస్థితి కనిపిస్తోంది.

ఊరంతా సంబరం

- చంద్రన్న పట్టాభిషేకం వీక్షించి పులకించిన కూటమి శ్రేణులు
- జిల్లావ్యాప్తంగా భారీ స్క్రీన్‌ల ఏర్పాటు
- పలుచోట్ల కేక్ కటింగ్‌లు, ర్యాలీలు
- ఎన్టీఆర్ విగ్రహాలకు నివాళులు
- కేసరపల్లికి భారీగా తరలిన శ్రేణులు
- రెండు మంత్రి పదవులపైనా ఆనందోత్సాహాలు


ఒంగోలు కమ్మపాలెంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్‌పై చంద్రబాబుకు హారతి ఇస్తున్న మహిళలు

ఒంగోలు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తెలుగుదేశం పార్టీ శ్రేణులు బుధవారం సంబరాల్లో మునిగిపోయాయి. ఊహించిన దాని కన్నా భారీ మెజారిటీతో అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొంది కూటమి అధికారంలోకి రాగా మూడు పార్టీలతో కూడిన మంత్రివర్గ ప్రమాణస్వీకారం అట్టహాసంగా జరిగింది. కృష్ణా జిల్లా కేసరపల్లి వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోదీ సమక్షంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్, ఉమ్మడి జిల్లాకు చెందిన పార్టీ కీలక నేతలైన డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, గొట్టిపాటి రవికుమార్ అదే వేదికపై మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. అలా రెండు పార్టీల అధినేతల పట్టాభిషేకంతోపాటు ఉమ్మడి జిల్లాలోని ఇరువురికి మంత్రి పదవులు దక్కడంపై కూటమి శ్రేణులు ప్రత్యేకించి తెలుగు తమ్ముళ్లు పులకించిపోయారు. సంబరాలు చేసుకున్నారు. కేసరపల్లిలో జరిగిన చంద్రబాబు, ఇతర మంత్రివర్గ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమానికి జిల్లాకు చెందిన టీడీపీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతలతోపాటు భారీగా ఆయా నియోజకవర్గాల నాయకులు తరలివెళ్లారు.

ప్రత్యక్ష ప్రసారం.. కేరింతలు కొట్టిన జనం

ప్రభుత్వపరంగా ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమాన్ని జిల్లా అంతటా ప్రత్యక్ష ప్రసారం చేశారు. అన్ని సచివాలయాలు, మండల కార్యాలయాలతోపాటు పట్టణాల్లోని వివిధ ప్రైవేటు హాళ్లలో భారీ స్క్రీన్లను ఏర్పాటు చేయగా పెద్దసంఖ్యలో ప్రజలు వీక్షించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల ప్రమాణస్వీకార సమయంలో అభిమానులు కేరింతలు కొట్టారు. కొన్నిచోట్ల చంద్రబాబుకు మహిళలు స్క్రీన్‌లపైనే హారతులు ఇచ్చారు. అదేసమయంలో కొందరు ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ కేక్ కటింగ్‌లు, ర్యాలీలు నిర్వహించి ఆనందోత్సవాలు చేశారు. పెద్దఎత్తున బాణ సంచాను పేల్చి సంబరాలు చేసుకున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ లైటింగ్ వేశారు రాత్రి సమయాల్లో కరెంటు వెలుగులతో అంతటా పండుగ వాతావరణం నెలకొంది. మరోవైపు కేసరపల్లి సభ ముగించుకొని తిరుగు ప్రయాణమైన రాయలసీమ ప్రాంతం వారికి జిల్లాలోని కంభం ప్రాంతంలో యంత్రాంగం ద్వారా ఆహారం అందజేశారు. పలుచోట్ల స్థానిక పార్టీశ్రేణులు కూడా అలాంటి ఏర్పాట్లను చేశాయి.


కమ్మపాలెంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు, తెలుగు మహిళలు


అద్దంకి బస్టాండు వద్ద శ్రేణుల వేడుకలు


ఉప్పుగుండూరులో ర్యాలీ నిర్వహిస్తున్న తెలుగు మహిళలు


పేర్నమిట్టలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు

వెల్లువెత్తిన అభిమానం..!

సీఎంగా చంద్రబాబు కొలువుదీరిన వేళ.. భారీగా సంబరాలు ● ప్రజలు వీక్షించేందుకు ఎల్ఈడీ స్ర్కీన్లు
పలుచోట్ల అన్నదానాలు ● కేక్ కటింగ్‌లతో శ్రేణుల ఆనందోత్సాహాలు


నిర్మల్‌నగర్‌లో ప్రమాణస్వీకారాన్ని చూస్తూ జేజేలు పలుకుతున్న నాయకులు

ఒంగోలు(కార్పొరేషన్), జూన్ 12: తమ అభిమాన నాయకుడు నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా కొలువుదీరిన వేళ ఒంగోలు నగరమంతా సంబరాలలో మునిగిపోయింది. చంద్రబాబుతో పాటు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, ఇతర మంత్రులు, ఒంగోలు ఎమ్మెల్యేగా దామచర్ల జనార్దన్ ప్రమాణ స్వీకార మహోత్సవం వీక్షణ కార్యక్రమం ఒంగోలులో పండుగ వాతావరణంలో జరిగింది. ప్రజలు చూసేందుకు ఇక్కడి అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రం, అంబేడ్కర్‌భవన్‌లో, పలు ప్రభుత్వ కార్యాల యాలు, సచివాలయాల్లో ప్రత్యేక స్ర్కీన్‌లు, ఎల్ఈడీ టీవీలు ఏర్పాటు చేశారు ఇదిలా ఉండగా నగరంలోని టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు కేక్‌లు కట్ చేసుకుని స్వీట్లు పంచుకుని పండుగలా జరుపుకున్నారు. స్థానిక కమ్మపాలెంలో భారీ ఎల్ఈడీ స్ర్కీన్ ఏర్పాటు చేయగా, 7,8 డివిజన్‌ల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక కార్పొరేటర్లు దాచర్ల వెంకటర మణయ్య, సంద్రపాటి వర్షవర్ధతోపాటు, స్థానిక నాయకుల ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. ఉదయం 9గంటల నుంచే తరలివచ్చిన ప్రజలు, కార్యకర్తలు ఆదంతం చంద్రబా బు ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. ప్రజలకు అన్నదానం చేశారు. ఇక స్థానిక 36వ డివిజన్‌లో తెలుగు తమ్ముళ్ళు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీఎంగా చంద్రబాబు, ఒంగోలు ఎమ్మెల్యేగా దామచర్ల జనార్దన్‌కు జేజేలు పలికారు. భారీ కేక్ కటింగ్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్య క్రమంలో మండవ మురళీ, దాయనేని ధర్మ, నల్లూరి ప్రదీప్, యర్ర సారధి, బెజవాడ మురళీ బెజవాడ బుచ్చి, బెజవాడ వెంకట్రావు, కంచర్ల సుబ్బారావు, పోనాటి సుబ్బారావు, మువ్వల శ్రీనివాసరావు పాల్గొన్నారు. అలాగే 30వ డివిజన్‌లో టీడీపీ నాయకులు కేక్ కటింగ్‌లతో సంబరాలు జరుపుకున్నారు. డివిజన్ అధ్యక్షులు నత్తల కనకారావు నేతృత్వంలో స్వీట్లు పంచుకున్నారు. దాంతోపాటు మెప్మా, కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకార వేడుక వీక్షణలో పొదుపు సంఘాల మహిళలు పాల్గొని సంతోషాలు పంచుకున్నారు.


కమ్మపాలెంలో అన్నదానం

చెన్నకేశవ లే అవుట్ పార్కులో..


కేక్ కట్ చేస్తున్న నాయకులు, అభిమానులు

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా నగరంలోని చెన్నకేశవ లే అవుట్ పార్కులో టీడీపీ అభిమానులు, ఎన్టీఆర్ అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. స్థానిక లే అవుట్ పార్కులో, అలాగే అద్దంకి బస్టాండ్ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద భారీ కేక్‌లు కట్ చేసి, బాణసంచా కాల్చి సంతోషాలు పంచుకున్నారు. ప్రజలకు స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చెన్నుపాటి వేణు, నాయకులు చెన్నుపాటి వరప్రసాద్, నిడమనూరి నాగేశ్వరరావు, మండవ రంగారావు, కుర్ర భాస్కర్, ఆవుల ప్రసాద్, పుచ్చకాయల అంజిబాబు, షేక్ మస్తాన్ వలి, నాదెళ్ళ రత్నం, మార్నేని సుబ్బారావు, ఆటో శ్రీను, ఏలూరి చంద్ర, టెంకాయల బాబు, కొట్రగడ్డ సింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉలిచిలో .. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఉలిచి గ్రామంలో సంబరాలు అంబరాన్నంటాయి. కార్యక్రమంలో చుంచు శేషయ్య, మండవ మురళీకృష్ణ, మండవ సుబ్బారావు, చుంచు సింగయ్య, దుగ్గినేని వెంకట్రావు, యర్రంనేని నరసింహరావు, యర్రంనేని వెంకటశేషయ్య, యర్రా అంజయ్య, గల్లా గాంధీ పలువురు పాల్గొన్నారు.

శివం అనాథ శరణాలయంలో..

ఒంగోలు(విద్య): చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా స్థానిక సంతపేటలోని శివం అనాథ శరణాలయంలో కేక్ కట్ చేశారు. నగరంలో సంచార వాహనం ద్వారా అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖలీఫ్‌తుల్లా బాషా, టీడీపీ నగర కార్యదర్శి దాయినేని ధర్మ, చౌదరి, వడ్డెంపూడి సుజాత, చైర్మన్ గొల్లపూడి శ్రీహరి, మండవ సుబ్బారావు, మురళి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మద్దిపాడు మండలంలో..

మద్దిపాడు: ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం పురస్కరించుకుని దొడ్డవరప్పాడులో మాజీ సర్పంచ్ గోరంట్ల చిరంజీవి ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి బాణసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. మాజీ సర్పంచ్ జంపని రమ్యకృష్ణ, గోరంట్ల హనుమంతరావు, చిన్నమ్మ రాజు, ముల్లూరి ఆంజనేయులు, వరపర్ల కొండయ్య వెంకటేశ్వర్లు, రవి వెంకట్రావు పాల్గొన్నారు. మద్దిపాడులో మాజీ సర్పంచ్ ఉప్పు గుండూరు నాగేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు ఆధ్వర్యంలో ఎల్ఈడీ స్ర్కీన్‌లు ఏర్పాటు చేయగా ప్రజలు పెద్దసంఖ్య లో ప్రజలు చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని తిలకించారు. కార్యక్రమంలో మండవ రంగారావు, మండవ గోపీనాథ్, రావి నరసింహారావు, రెబ్బవరపు ప్రభాకర్, బాలచందర్, శుద్ధపల్లి అనిల్, అద్దేపల్లి దుర్గాభవాని, కడియాల రఘుబాబు, కోడూరి లక్ష్మీనారాయణ, పాటిబండ్ల చెంచయ్య, ముల్లూరి మురళి, దేవబత్తిన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు మండలంలో..

సంతనూతలపాడు: సీఎంగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని బుధవారం మండలంలోని పలుగ్రామాల ప్రజలు ఎల్ఈడీ స్ర్కీన్‌ల ద్వారా తిలకించారు. సంతనూతలపాడులో పార్టీ అధ్యక్షుడు మద్దినేని హరిబాబు ఆధ్వర్యంలో బస్టాండ్ వద్దనున్న ఎన్టీఆర్, మన్నం సింగయ్య విగ్రహాలకు పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఎల్ఈడీ స్ర్కీన్ ద్వారా చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని తిలకించారు. ఎమ్.వేములపాడులో గ్రామ అధ్యక్షుడు మారెళ్లశ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి స్థానిక సచివాలయంలో ఎల్ఈడీ స్ర్కీన్ ద్వారా ప్రమాణస్వీకారాన్ని తిలకించారు. పేర్నమిట్టలో మాదాల లక్ష్మణరావు ఆధ్వర్యంలో చంద్రబాబు చిత్రపటానికి పాలఅభిషేకం చేశారు.

ఉప్పుగుండూరులో..

నాగులుప్పలపాడు: ఉప్పుగుండూరు బస్టాండ్ వద్ద టీడీపీ నాయకులు నల్లూరి సతీష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక టీవీతెరలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఇతర ఎన్డీఏ కూటమి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని వీక్షించారు. ఉత్తరబజారులో సైతం ప్రజలు వీక్షించేలా ప్రత్యేక ఎల్ఈడీ తెరలను ఏర్పాటు చేశారు. ఉత్తరం బజారు నాయకులు మహిళలు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ వద్ద నున్న ఎన్టీఆర్ విగ్రహానికి పాల అభిషేకం చేశారు. అనంతరం అన్నదానం చేశారు. గంగమ్మ సెంటర్ వద్ద పావులూరి వాసు ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అల్పాహారం అందించారు. కూటమి నాయకులు పలు వాహనాల్లో ప్రమాణ స్వీకారానికి కేసరపల్లి తరలివెళ్లారు.


ఉప్పుగుండూరులో చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని వీక్షిస్తున్న నాయకులు


మద్దిపాడులో జెండాను ఆవిష్కరించిన నాయకులు


ఉలిచిలో కేక్ కట్ చేస్తున్న అభిమానులు

చీమకుర్తిలో..

చీమకుర్తి : సీఎం చంద్రబాబు ప్రమాణస్వీకా రోత్సవం సందర్భంగా బుధవారం చీమకుర్తిలో అభిమానుల ఆనందోత్సాహాలు వెల్లివెరిశాయి. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వాసవి కళ్యాణమండపంలో పెద్ద తెర ఏర్పాటు చేశారు. బస్టాండ్ సెంటర్‌లో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కొట్రగడ్డ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.


సంబరాల్లో పాల్గొన్న అభిమానులు

ఆంధ్రజ్యోతి ప్రతిరోజు క్లాసిఫైడ్స్ — ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం

సూ॥వైజర్స్ కావలెను

■ ఒంగోలు, రాజీవ్‌నగర్‌లో బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ పర్యవేక్షించుటకు సూపర్‌వైజర్ కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది ఫోన్ నెంబరుకు సంప్రదించగలరు. సెల్: **9182678728**

AJO-183928

జ్యోతిష్యాలయం

■ ఆదిశక్తి రేణుక యల్లమ్మ తల్లి జ్యోతిష్యము చెప్పబడును. ప్రేమ, పెళ్ళి, సంతానం, ఆరోగ్యం, కుటుంబ సమస్యలు, ఏ సమస్యలైన పరిష్కారం చెప్పబడును. సంప్ర॥ G.కృష్ణంరాజు, R.T.C.బస్టాండు దగ్గర, ఒంగోలు, సెల్: **9640409458**

AJO-183870

WANTED STAFF

■ **Service / Sale** శ్రీ సాయి ఏజన్సీస్ (AMARON)లో పని చేయడం కొరకు స్టాఫ్ కావలెను. Qua : 10th Class Pass/Fail, (Sale) Qua : Inter Pass / Fail, Salary Minimum 12,000/- ఆపైన సంప్ర॥ సెల్: **9492819618, 8977222729.**

AJO-183875

రియల్ ఎస్టేట్

■ అమరావతి రోడ్డు, తాడికొండ అడ్డరోడ్డు దగ్గరలో CRDA ప్లాట్స్ కలవు. సంప్రదించండి : RAVI - 9059440723

AJG-191134

WANTED

■ ఒంగోలు మంగమూరురోడ్డులో నారాయణ పబ్లిక్ స్కూల్ నందు పనిచేయుటకు Graduate Unmarried Male/Female వార్డెన్స్ మరియు కంప్యూటర్ టీచర్ కావలెను. సంప్ర॥ **98491 83364.**

AJO-250

WANTED

■ **ACE Spoken English & Communication Skills Academy** ఇంగ్లీషు మాట్లాడే యువతీయువకులు కావలెను. జీతం : 15k–25k. జాబ్ లొకేషన్ : ప్రకాశం జిల్లా, సంప్ర॥ **9949113714**

AJO-246

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు,చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.

పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

కేసరిపల్లి సభ కీలక బాధ్యతల్లో సత్య

అభినందించి ప్రధాని మోదీకి పరిచయం చేసిన చంద్రబాబు



ప్రధానిమోదీకి నమస్కరిస్తున్న సత్య, పక్కన సీఎం చంద్రబాబు

ఒంగోలు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన టీడీపీ యువనేత దామచర్ల సత్య బుధవారం కేసరిపల్లి వద్ద జరిగిన ఎన్‌డీఏ కూటమి మంత్రివర్గ ప్రమాణస్వీకార సభలో కీలకంగా వ్యవహరించారు. కొండపి నియోజకవర్గ టీడీపీ బాధ్యతలు అన్నీ తానై చూసే సత్య రాష్ట్రస్థాయిలో యువనాయకుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. అధినేత చంద్రబాబు, యువనేత లోకేష్‌లకు అత్యంత ఆత్మీయునిగా గుర్తింపు పొందిన ఆయన లోకేష్ యువగళం పాదయాత్ర ఏర్పాట్లలో రాష్ట్రవ్యాప్తంగా ప్రధానభూమిక పోషించారు. ఉత్తరాంధ్ర జోనల్ టీడీపీ ఇన్‌చార్జిగా సమర్థవంతంగా పని చేశారు. ఒంగోలు మహానాడు నుంచి పార్టీలో సత్యకు ప్రత్యేక గుర్తింపు రాగా అప్పటి నుంచి రాష్ట్ర పార్టీ తరుపున ఎక్కడ ఏ సభ నిర్వహిస్తున్నా ఏర్పాట్లు పర్యవేక్షించే కీలక బాధ్యతలలో ఒకరిగా సత్యను పంపుతున్నారు. కాగా ప్రమాణస్వీకారసభ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ హాజరు కాగా సత్యను చంద్రబాబు ఆయనకు ప్రత్యేకంగా పరిచయం చేశారు.

కేంద్రమంత్రిని సత్కరించిన శివారెడ్డి

ఒంగోలు(కలెక్టరేట్), జూన్ 12: కేంద్ర జాతీయ భారీ పరిశ్రమలు, ఉక్కు సహాయమంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మను బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి బుధవారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మంత్రికి శాలువతో సత్కరించి బోకే ఇచ్చి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జీ రవిశంకర్, శివాజీ తదితరులు ఉన్నారు.

మంత్రి స్వామికి శుభాకాంక్షల వెల్లువ



మంత్రిస్వామితో టీడీపీ నాయకులు

మద్దిపాడు, జూన్ 12 : రాష్ట్ర మంత్రిగా బుధవారం ప్రమాణ స్వీకారం చేసిన డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామిని పలువురు అభినందనలతో ముంచెత్తారు. కొండపి నియోజకవర్గం నుంచి మంత్రివర్గంలో ప్రాతినిధ్యం వహించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రమోతు శ్రీనివాసులు, సమన్వయ కమిటీ సభ్యుడు రేగుల వీరనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు చేరెడ్డి నరసారెడ్డి, మాజీ జడ్పీటీసీ తుళ్లూరి నరసింహారావు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గొంటు హనుమారెడ్డి, నాయకులు మలసాని కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు. వీరితోపాటు గుళ్లాపల్లి మల్లికార్జున, మండాడి బాలకోటయ్య, భైరపనేని శ్రీను, హరికృష్ణ, వెంకటనారాయణ, అమరా వెంకటేశ్వర్లు, రేగుల రామారావు, ఎంఆర్‌పీఎస్ జర్నలిస్టుల ఫోరం జిల్లా అధ్యక్షుడు గురజాల బాబూరావు, మాజీ కోఆప్షన్ సభ్యుడు గురజాల ఏసుపాదం, కె.మోహన్‌రావు, గురుబ్రహ్మం, చేరెడ్డి సుబ్బారెడ్డి, మలసాని నాగేశ్వరరావు, మండలపు వెంకటేశ్వర్లు, బొమ్మినేని రవి తదితరులు కూడా స్వామికి అభినందలు తెలిపారు.

కొత్త మంత్రులకు పోతుల అభినందనలు



మంత్రులను అభినందిస్తున్న పోతుల రామారావు

టంగుటూరు, జూన్ 12 : రాష్ట్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన ముగ్గురిని మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు బుధవారం కలిశారు. గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ స్వామి, అనగాని సత్యప్రసాద్‌లను అభినందించి శుభాకాంక్షలు చెప్పారు. పోతుల వెంట ఆయన సోదరుడు రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

కెల్లంపల్లి నేతల తిరుమల పాదయాత్ర



తిరుమలకు పాదయాత్ర చేపట్టిన నాయకులు

మద్దిపాడు, జూన్ 12 : సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అఖండ విజయం సాధించడంతో మండలంలోని కెల్లంపల్లికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు 30 మందికిపైగా బుధవారం తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో చంద్రబాబు సీఎం కావాలని, ఎమ్మెల్యే స్వామికి మంత్రి పదవి రావాలని, ఒంగోలు ఎంపీగా మాగుంట గెలవాలని కోరుకున్న వారు అవన్నీ నెరవేరడంతో మొక్కు తీర్చుకునేందుకు తిరుమలకు బయల్దేరారు. ముందుగా స్థానిక వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు రేగుల వీరనారాయణ, మండాటి బాలకోటయ్య, భైరపునేని హరికృష్ణ, శ్రీను, వెంకటనారాయణ, అమరా వెంకటేశ్వర్లు, రేగుల రామారావు పాల్గొన్నారు.

తెలుగు తమ్ముళ్ల సంబరాలు



టంగుటూరులో వీక్షిస్తున్న యువత

కొండపి, జూన్ 12 : సీఎంగా చంద్రబాబు, మంత్రిగా ఎమ్మెల్యే స్వామి ప్రమాణ స్వీకారం సందర్భంగా నియోజకవర్గంలోని తెలుగు తమ్ముళ్లు బుధవారం సంబరాల్లో మునిగి పోయారు. కొండపిలోని పెద్దఎత్తున బాణసంచా కాల్చారు. కేక్ కట్ చేసి ప్రజలు స్వీట్లు పంపిణీ చేశారు. పలు చోట్ల టీవీలు, ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. జరుగుమల్లి, పొన్నలూరు ఎంపీడీవో కార్యాలయాల్లో టీవీలు ఏర్పాటు చేసి చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని అధికారులు, సిబ్బంది తిలకించారు.

టంగుటూరు: టంగుటూరులో కొండపి రోడ్డులోని పత్తిపాటి వెంకట సుబ్బారావు పొగాకు గోడౌన్‌లో ఆయన కుమారుడు రాంబాబు ఎల్ ఈడీ స్క్రీన్‌పై ఏర్పాటు చేశారు. అక్కడే మధ్యాహ్న భోజనాలు కూడా కల్పించారు.

జరుగుమల్లిలో... మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ నాయకులు చంద్రబాబు ప్రమాణస్వీకారం సందర్భంగా టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. పొన్నలూరులో స్వీట్లు పంచారు.


సభా వేదిక వద్ద కోలాహలం



వేదిక ముందు నందమూరి, నారా కుటుంబ సభ్యులతో హీరో రామ్‌చరణ్

చంద్రబాబు అనే నేను..
ప్రభంజనమై మేమూ..

కేసరపల్లిలో ఘనంగా టీడీపీ కూటమి మహా పట్టాభిషేకం

ప్రజాతీర్పునకు పట్టాభిషేకమైంది. జనం ప్రభంజనమై పండుగలా కదిలింది. అభిమాన కోలాహలం నడుమ కేసరపల్లి జయకేతనమై ఎగరగా, గన్నవరం జనవరమై జేజేలు పలికింది. 'నారా చంద్రబాబు నాయుడు అను నేను..' అనే మాటతో అభిమాన సంబరాలు అంబరాన్నంటాయి. కేసరపల్లిలో బుధవారం ఉదయం జరిగిన టీడీపీ కూటమి ప్రమాణస్వీకార మహోత్సవానికి అతిరథ మహారథులు హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సినీ ప్రముఖులు రజనీకాంత్, చిరంజీవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

బస్సెక్కిన అభిమానం





చంద్రబాబు ప్రమాణస్వీకారం చేస్తుండగా నందమూరి రామకృష్ణ భావోద్వేగం, బాలకృష్ణ, భువనేశ్వరి అనురాగం, సభావేదిక వద్ద నాగలితో ఓ రైతు ప్రదర్శన


వేదికపై బాలకృష్ణ, రజనీకాంత్ దంపతులు, చిరంజీవి


జనసేన, టీడీపీ, బీజేపీ స్టిక్కరింగ్ స్కూటర్లపై వినూత్నంగా..


వేలం నిర్వహిస్తున్న అధికారులు

పొగాకు ధరలకు బ్రేక్

- వ్యాపారులు సిండికేట్
- ఆందోళనలో రైతులు

పొదిలి, జూన్ 12 : బ్రేకులు లేని రైలులా వెళుతున్న పొగాకు ధరలకు ఉన్నట్లుండి ఒక్కసారిగా వ్యాపారులు బ్రేకులు వేశారు. ఈ ఏడాది వేలం ప్రారంభం నుంచి పొగాకు ధరలు పైపైకి పోతుండటంతో రైతన్నల్లో ఆశలు పెరిగిపోయాయి. ఒకానొక సమయంలో రోజుకోరేటు పలుకుతుండటంతో రైతులు పొగాకు వేలానికి తీసుకెళ్ళాలా లేదా అనే ఆలోచనలో పడేశాయి. కిలో రూ. 230తో ప్రారంభమైన పొగాకు ధరలు జిల్లాలో రూ. 360కి చేరాయి. ఈక్రమంలో వ్యాపారులు మనం ఎందుకు పోటీపడి కొనాలి ఎప్పుడైనా మనమే కదా కొనుగోలు చేయాల్సిందని అనుకున్నారేమో గాని రూ. 330 టార్గెట్‌గా పెట్టుకొని ప్రస్తుతం కొనుగోలు చేస్తున్నారు. బోర్డు చరిత్రలోనే ఇంత ధరలు లేవని అనుకునేలోపే వ్యాపారులు ధరలను అమాంతం తగ్గించి కొనుగోలు చేయడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వ్యాపారులు పోటీపడి బ్రైట్, మీడియం అనే తేడా లేకుండా పొగాకు కొనుగోలు చేసిన వారు ఇప్పుడు ఎందుకు వెనుకాడుతున్నారో తెలియడం లేదని రైతన్నలు అంటున్నారు. బ్రైట్, మీడియం, లోగ్రేడ్ అనే తారతమ్యం లేకుండా కొనుగోలు చేసిన వ్యాపారులు సిండికేట్ అయి ధరలు ముందుకు సాగకుండా గేట్ పెట్టుకున్నారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈక్రమంలో తగ్గిన పొగాకు ధరలు వారిని ఆలోచనలో పడేశాయి. జిల్లాలో అన్ని కేంద్రాల్లో వ్యాపారులు ధరలకు కల్లెం వేశారనే చెప్పాలి. దీంతో అన్నదాతలు నష్టపోయే ప్రమాదం ఉంది.

కడప, నంద్యాల జిల్లాల వారికి ఆహారం ఏర్పాటు

కంభం, జూన్ 12 : బుధవారం అమరావతిలో జరిగిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిల ప్రమాణ స్వీకారం అనంతరం తిరుగు ప్రయాణం అయ్యే కడప, నంద్యాల జిల్లాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ఆహారం పంపిణీ చేశారు. ఉన్నతాధికారుల సూచన మేరకు కంభం జూనియర్ కాలేజీ ఆవరణలో పులిహోర, పెరుగు అన్నం పొట్లాలను తహసీల్దార్ రామయ్య, ఎంపీడీవో మస్తాన్‌వలి, సిబ్బంది ఏర్పాట్లు చేయడమే కాకుండా వచ్చిన దాదాపు 2వేల మందికి ఆహార పొట్లాలను పంపిణీ చేశారు.


కంభంలో ఆహార పొట్లాలను సిద్ధం చేసిన తహసీల్దార్ రామయ్య

భారీగా తరలిన టీడీపీ శ్రేణులు

కొమరోలు, జూన్12: గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలోని టీడీపీ కార్యాకర్తలు, నాయకులు పెద్దసంఖ్యలో అమరావతిలో జరిగిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకార కార్యాక్రమానికి తరలివెళ్ళినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు తెలిపారు.

టీడీపీ నేతల సంబరాలు

- ఎల్‌ఈడీ స్క్రీన్లలో చంద్రబాబు ప్రమాణస్వీకారాన్ని వీక్షించిన ప్రజలు
- బాణసంచా కాల్చి, స్వీట్లు పంచిన కార్యకర్తలు
- పలు చోట్ల అన్నదానాలు..

కంభం, జూన్ 12 : ముఖ్యమంత్రిగా నాల్గోసారి నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా బుధవారం కంభం జుమ్మామసీదు సెంటర్‌లో తెలుగుదేశం ముస్లిం మైనారిటీ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ ముస్లిం మైనారిటీ సీనియర్ నాయకులు దాదా మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు పెడుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఒంగోలు పార్లమెంటు ముస్లిం మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి హనీఫ్‌అహమ్మద్, పి.నాగూర్ అలీఖాన్, రజాక్‌బాషా, షేక్ జిలాని, సయ్యద్ ఖాశిం, షేక్ రెహమాన్, షేక్ ఫజుల్లా, సుకూర్, మండల జనసేన అధ్యక్షులు ప్రసాద్, బీసీ సెల్ నాయకులు సోమయ్య, వేల్పుల భూపాల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కంభం మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు సీఎంగా ప్రమాణ స్వీకారాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు టీవీలలో వీక్షించారు. కంభం ఎంపీడీవో కార్యాలయంలో, తురిమెళ్ళ పంచాయతీ కార్యాలయంలో టీవీలలో వీక్షించారు.


కంభంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు


త్రిపురాంతకంలో ర్యాలీ చేస్తున్న టీడీపీ శ్రేణులు

త్రిపురాంతకంలో టీడీపీ ర్యాలీ

త్రిపురాంతకం : చంద్రబాబు ప్రమాణ స్వీకారం సందర్భంగా మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో టీడీపీ శ్రేణులు ర్యాలీలు చేశాయి. మండల పార్టీ మాజీ అధ్యక్షుడు మోటకట్ల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో త్రిపురాంతకంలోని సినిమాహాలు సెంటర్ నుంచి ప్రధాన రహదారి గుండా ఆర్టీసీ బస్టాండ్ మీదుగా వై.పాలెం కూడలి వరకూ బాణసంచా కాల్చుతూ, డీజేల మధ్య భారీ ర్యాలీ చేపట్టారు. ఉత్సాహంగా సాగిన ర్యాలీ అనంతరం వై.పాలెం కూడలి వద్ద కేక్ కట్‌చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం మండల కేంద్రంలోని బ్రహ్మంగారికాలనీ, అంబేడ్కర్ కాలనీ, అమ్మవారిశాల, వై.పాలెం కూడలి ప్రాంతాలో కార్యకర్తలకు భోజన కార్యక్రమాలను నిర్వహించారు. మండలంలోని సోమేపల్లి, రాజుపాలెంతోపాటు పలు గ్రామాలలో ర్యాలీలు చేసి బాణసంచా కాల్చారు.

బాణ సంచాపేల్చి, స్వీట్లు పంచుకున్న కార్యకర్తలు

ఎర్రగొండపాలెం : రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారోత్సవం సమయంలో బుధవారం ఎర్రగొండపాలెం మండలకేంద్రంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా పేల్చి, స్వీట్లు పంచుకున్నారు. ప్రధాన సెంటరులో ప్రదర్శన నిర్వహించారు. టీడీపీ నాయకులు ఉన్నం నరసింహారావు, మల్లెల వెంకటనారాయణ, మాజీ ఎంపీటీసీ షేక్ రఫీ, షేక్ ఖాశిం, షేక్ చిన్న ఖాశిం, రైతు సంఘం ఉపాధ్యక్షులు బొడ్డు ఆంజనేయరెడ్డి, చలువాది శ్రీను, సురేష్, జనసేన కార్యకర్తలు, ముఠా వర్కర్లు పాల్గొని స్వీట్లు పంచుకున్నారు.

ప్రమాణస్వీకారానికి..

ఎర్రగొండపాలెం టౌన్ నుంచి 50 మంది టీడీపీ కార్యకర్తలు బుధవారం వేకువ జామున ఆర్టీసీ బస్సులో చంద్రబాబునాయుడి ప్రమాణస్వీకారోత్సవాన్ని తిలకించేందుకు ఉత్సాహంగాబయలుదేరి వెళ్లారు. జై టీడీపీ, జై చంద్రబాబునాయుడు అంటూ నినాదాలు చేస్తూ కార్యకర్తలు వెళ్లారు.


ఎర్రగొండపాలెం ఎన్టీఆర్ సెంటరులో బాణసంచా కాలుస్తున్న టీడీపీ కార్యకర్తలు

ప్రమాణ స్వీకారాన్ని వీక్షించిన పురప్రజలు

మార్కాపురం : ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, ఇతర మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బుధవారం పురప్రజలు ఆనందోత్సాహాలతో వీక్షించారు. స్థానిక కాలేజీ రోడ్డులోని సౌజన్య ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన భారీ ఎల్‌ఈడీ స్ర్కీన్‌పై లైవ్ ద్వారా మహిళలు చూశారు. మున్సిపాలిటీ అధికారులు ప్రత్యేకంగా ఈ ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని అన్ని వార్డుల నుంచి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అదే విధంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో యువకులు బాణసంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశారు.


చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని వీక్షిస్తున్న పురప్రజలు


గిద్దలూరులో అన్నదానం చేస్తున్న టీడీపీ శ్రేణులు

భారీ స్ర్కీన్‌పై ప్రమాణ స్వీకార వీక్షణ

గిద్దలూరు టౌన్, జూన్ 12 : పట్టణంలోని మిస్టర్ చాయ్ దుకాణంలో భారీ స్ర్కీన్‌పై చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవ వీక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. చంద్రబాబుతోపాటు మంత్రులు ప్రమాణ స్వీకారం చేయగా లైవ్‌లో వీక్షించిన టీడీపీ శ్రేణులు, ప్రజలు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ జై చంద్రబాబు, జై తెలుగుదేశం, జై అశోక్‌రెడ్డి అంటూ నినాదాలు చేశారు. అనంతరం పార్టీ శ్రేణులకు, ప్రజలకు మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో భోజనసౌకర్యాలు ఏర్పాటు చేశారు. మాజీసర్పంచ్ దప్పిలి విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ చంద్రశేఖర్‌యాదవ్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

శివపురంలో అన్నదానం

మార్కాపురం రూరల్ , జూన్ 12 చంద్రబాబు నాలుగోసారి ప్రమాణ స్వీకారం సందర్భంగా పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు పంచాయతీ శివపురం గ్రామంలో టీడీపీ నాయకులు అన్నెం సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 300 మంది గ్రామస్థులకు అన్నదానం బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా పేలుస్తూ రంగులు జల్లుకుంటూ ఉత్సాహంగా విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. దేవరాజుగట్టు పంచాయతీ సర్పంచ్ మెట్టు లక్ష్మీదేవి శ్రీనివాసరెడ్డి , గ్రామ వార్డు మెంబర్ ఆనెకాళ్ల దుర్గా శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ టీడీపీ నాయకులు చిన్న నాగిరెడ్డి, పుల్లారెడ్డి, శివారెడ్డి, రామిరెడ్డి, సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటనారాయణరెడ్డి, గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మార్కాపురం, జూన్ 12: మోటారు బైక్ అదుపుతప్పి పంట కాలువలో పడిపోవడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం ఉదయం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బత్తుల బాజీబాబు (25) అనే యువకుడు మృతిచెందాడు. టౌన్ ఎస్సై అబ్దుల్ రెహమాన్ కథనం మేరకు తర్లుపాడు మండలం బుడ్డపల్లెకు చెందిన బత్తుల బాలయ్య కుమారుడు బాజీబాబు పట్టణానికి చెందిన గుంటక రామచంద్రారెడ్డి వద్ద ఎక్స్‌కవేటర్ ఆపరేటర్‌గా రెండు నెలల నుంచి పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే పగలంతా పనిచేసి మోటార్‌బైక్‌పై రాత్రి ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో చైతన్య స్కూల్ దాటిన తర్వాత మూలమలుపు వద్ద చప్టాను ఢీకొట్టి పంట కాలువలోకి మోటారుబైక్‌తో సహా పడిపోయాడు. ప్రమాదంలో తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఉదయం పోలీసులకు సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి వెళ్లి ఎస్సై అబ్దుల్ రెహమాన్ పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


ప్రమాదంలో మృతిచెందిన బాజీబాబు

బావిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మార్కాపురం రూరల్, జూన్ 12: మండలంలోని గజ్జలకొండ గ్రామ పంచాయతీ పరిధిలోని పడమటిపల్లి గ్రామ పొలాల్లో నీరు లేని బావిలో గుర్తుతెలియని మృతదేహాన్ని బుధవారం పోలీసులు గుర్తించారు. 30 అడుగుల లోతులో ఉన్న మృతదేహం సుమారు నెల క్రితం మృతి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఎక్స్‌కవేటర్ సహాయంతో బావి లోపల ఉన్న మృతదేహాన్ని పోలీసులు బయటకు తీయించారు. ప్యాంటు, షర్టు ధరించి ఉండటంతో పురుషునిగా గుర్తించారు. సంఘటనా స్థలాన్ని రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వ నాయక్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


బావిలో పడి ఉన్న మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, స్థానికులు

107 ఎర్రచందనపు దుంగలు సీజ్

- ఆటో, మోటర్‌బైక్ స్వాధీనం
- ఇద్దరు అరెస్టు

కొమరోలు, జూన్12: మండలంలోని చింతలపల్లి అడవీ ప్రాంతంలో అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనపు దుంగలను పట్టుకున్నట్లు ఫారెస్టు సబ్ ఇన్‌స్పెక్టర్ రఫీ తెలిపారు. అటవీశాఖాధికారులు తెలిపిన వివరాల మేరకు కొమరోలు మండలంలోని చింతలపల్లి అటవీ ప్రాంతంలో అక్రమంగా ఎర్రచందనం డంపింగ్ జరుగుతుందని సమాచారం అందింది. ఈ మేరకు అటవీశాఖాధికారులు భైరవతిప్ప సమీపంలో అక్రమంగా ఆటోలో తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 107 ఎర్రచందనపు దుంగలను, ఒక ఆటో, మెటర్ సైకిల్, 3 సెల్ ఫోన్లు, రూ.30,400 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేశారు. అదుపులోకి తీసుకున్న ఇరువురిని అరెస్టుచేసి తిరుపతికి తరలించినట్లు తెలిపారు.

గుర్తింపు ఉన్న పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి

ఎర్రగొండపాలెం, జూన్ 12 : ప్రభుత్వ గుర్తింపు ఉండి అన్ని అనుమతులు ఉన్న పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని ఎంఈవో పి. ఆంజనేయులు బుధవారం తెలిపారు. అనుమతి లేకుండా ఎవరైనా యాజమాన్యాలు పాఠశాలలు నిర్వహిస్తే మూసివేయిస్తామని ఆయన తెలిపారు. అలాగే ప్రయివేటు పాఠశాలల్లో విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న ఫీజులు వివరాలు డిస్‌ప్లే బోర్డులో ఉంచాలని సూచించారు. గురువారం నుంచి అన్ని ప్రభుత్వపాఠశాలలు, ప్రారంభం అవుతాయని, అడ్మిషన్లు చేసుకోవచ్చుననిఆయన తెలిపారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్యకేంద్రం సిబ్బంది

దొనకొండ, జూన్ 12 : ప్రజలు మలేరియా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారిణి సునీత చెప్పారు. ఆరోగ్యకేంద్రం సిబ్బందితో కలిసి మలేరియా వ్యతిరేక మాసోత్సవం కార్యక్రమం సందర్భంగా గురువారం దొనకొండలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీత మాట్లాడుతూ ఈనెల 31వ తేదీ వరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం రైల్వేస్టేషన్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో ఇన్యాసమ్మ, ఎంపీహెచ్ఎస్ ఫ్లెమింగ్ అలెగ్జాండర్, హెల్త్ సూపర్‌వైజర్ ప్రభావతీదేవి పాల్గొన్నారు.

నేడు పునీత అంథోనివారి మహోత్సవం

దొనకొండ, జూన్ 12 : దొనకొండలోని ఆర్సీఎం చర్చి ఆవరణలో సంఘకాపరి రెవరండ్ ఫాదర్ గుడిపల్లి థామస్ నేతృత్వంలో గురువారం పునీత అంథోనివారి మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు సంఘస్తులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి నెల్లూరు మేత్రాసనం వికార్ జనరల్ రెవరెండ్ ఫాదర్ జోసఫ్‌మణి మరికొందరు గురువులతో సమష్టి దివ్యబలిపూజ జరుగుతుందన్నారు. ప్రజలకు ప్రేమ విందు, సాయంత్రం ప్రత్యేక పల్లకి యాత్ర ఉంటుందని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ బోధన

పామూరు, జూన్, 12 : ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా పామూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గత విద్యా సంవత్సరం 10వ తరగతిలో వచ్చిన మార్కులతో కరపత్రాలు ముద్రించి విద్యార్థులను ఆకర్షిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్వాలిఫైడ్ టీచర్ల చేత విద్యా బోధనతో పాటు విద్యార్థులకు స్టూడెంట్ కిట్‌ను ప్రభుత్వం అందచేస్తోందని, మధ్యాహ్నం నాణ్యమైన భోజనం పెడుతుందని వివరిస్తూ ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నట్లు హెచ్ఎం రామస్వామి తెలిపారు.

బాలకార్మిక వ్యవస్థను రూపుమాపాలి



బాలలకు అవగాహన కల్పిస్తున్న నాయబ్‌రసూల్

కనిగిరి, జూన్ 12 : బాలకార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ చైర్మన్ గఫార్ చెప్పారు. ప్రపంచ బాలకార్మిక వ్యవస్థ దినోత్సవం సందర్భంగా పట్టణ సమీపంలోని కాశిరెడ్డి కాలనీలో బుధవారం కాలనీవాసులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పారాలీగల్ వలంటీర్ ఎం రమేష్‌బాబు, నవకుమార్, కాలనీ వాసులు, సచివాలయ, అంగన్వాడీలు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత

పామూరు జూన్ 12 : బాలకార్మిక వ్యవస్థను నిర్మూలనకు అందరూ సహకరించాలని అందమైన బాల్యాన్ని బడిలో గడిపి భావిభారత పౌరుల్ని కాపాడుకోవాల్సి బాధ్యత మనందరిపై ఉందని స్వయంకృషి సేవా సంస్థ డాక్టర్ షేక్ నాయబ్‌రసూల్ సూచించారు. ప్రపంచబాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బాలలకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భువనేశ్వరం, ప్రవీణ్ పాల్గొన్నారు.

పల్లెల్లో ప్రమాణ స్వీకార సంబరాలు

విద్యుత్ కాంతుల వెలుగులో ప్రభుత్వ కార్యాలయాలు



విద్యుత్ కాంతుల వెలుగులో పీసీపల్లి ఎంపీడీవో కార్యాలయం

పీసీపల్లి, జూన్ 12 : రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ఏర్పాటై రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబుతో పాటు మంత్రివర్గం బుధవారం చేసిన ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా మండలంలోని గ్రామాల్లో ఎన్‌డీఏ కూటమిలోని తెలుగుదేశం, బీజేపీ, జనసేన శ్రేణులతో పాటు ప్రజలు సంబరాలు చేసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో మండల పరిషత్ కార్యాలయాలతో పాటు గ్రామ సచివాలయాలకు రంగురంగుల విద్యుత్ దీపాలను వేశారు. ప్రజలతో పాటు ఆయా కార్యాలయాల ఉద్యోగులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా ముఖ్యమంత్రి, మంత్రుల ప్రమాణస్వీకార మహోత్సవాన్ని వీక్షించారు.

విద్యుత్ కాంతులతో ప్రభుత్వ కార్యాలయాలు



దొనకొండలోని ప్రభుత్వ కార్యాలయం

దొనకొండ, జూన్ 11 : రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బుధవారం జరిగే ప్రమాణ స్వీకార కార్యాక్రమం సందర్భంగా నూతన ప్రభుత్వానికి స్వాగతం పలికేలా పలు ప్రభుత్వ కార్యాలయాలను మంగళవారం రాత్రి విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దొనకొండలోని మండల పరిషత్ కార్యాలయం, గ్రామ సచివాలయాలపై అధికారులు విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయటంతో కార్యాలయాలు ధగధగలాడుతున్నాయి.

వ్యర్థాలను తొలగించిన పంచాయతీ అధికారులు



వ్యర్థాలను తొలగించిన అధికారులు

ముండ్లమూరు, జూన్ 12 : ముండ్లమూరు నుంచి తమ్మలూరు వెళ్లే ప్రధాన రహదారి పక్కన వ్యర్థాలు పడవేయటంతో డంపింగ్ యార్డుగా మారిపోయాయి. దీంతో ప్రజలు దుర్వాసనతో అల్లాడిపోతున్నారు. ఆంధ్రజ్యోతి దినపత్రిక ఈనెల 11న రహదారులపై వ్యర్థ పదార్థాలు అనే శీర్షికన ప్రచురితమవడంలో పంచాయతీ కార్యదర్శి ఇడమకంటి రాజశేఖరరెడ్డి బుధవారం ఎక్స్‌కవేటర్ తీసుకువచ్చి వాటిని తొలగించి శుభ్రం చేయించారు. దీంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతానికి బాలుడు మృతి

మార్కాపురం, జూన్ 12 : విద్యుత్ షాక్ తగిలి అన్నం ప్రశాంత్ అనే 14 నెలల బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని డేగరమూడి రోడ్డు వద్దఇంటిలో జరిగింది. అన్నం దుర్గామల్లేశ్వరరావు భవాని దంపతుల చిన్నకుమారుడైన ప్రశాంత్ మంగళవారం ఉదయం నీళ్ల కోసం విద్యుత్ మోటారును వేసినపుడు వెళ్లి పట్టుకోగా విద్యుత్ షాక్ తగిలింది. వెంటనే తల్లిదండ్రులు బాలుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసంచిలకలూరిపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి చనిపోయాడు. తల్లిదండ్రులు, బంధువులు విలపించారు.

ఊరువాడ టీడీపీ సంబరాలు



కనిగిరిలో బాబు, పవన్‌ల చిత్రపటాలకు పాలభిషేకాలు చేస్తున్న శ్రేణులు



దర్శిలో ప్రమాణ స్వీకారాన్ని ఎల్‌ఈడీ స్క్రీన్‌పై చూస్తున్న ప్రజలు



పామూరులో కేక్ కట్ చేస్తున్న కూటమి నేతలు

సీఎంగా చంద్రబాబు, రాష్ట్ర మంత్రి వర్గం ప్రమాణస్వీకారం

మహోత్సవాన్ని తిలకించిన కూటమి శ్రేణులు

చాలా ప్రాంతాల్లో భారీ స్క్రీన్ల ఏర్పాటు

విజయవాడకు వాహనాల్లో తరలిన టీడీపీ నేతలు, కార్యకర్తలు

ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఆ వేడుక వీక్షణ

కనిగిరి, జూన్ 12 : చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా కనిగిరిలో టీడీపీ శ్రేణులు బుధవారం ఘనంగా సంబరాలు చేసుకున్నాయి. స్థానిక అమరావతి గ్రౌండ్‌లో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ల చిత్రపటాలకు పాలభిషేకాలు చేశారు. ఎన్డీయే సింబల్ బీజేపీ, జనసేన, టీడీపీ గుర్తులను కలుపుతూ ఉండే సర్కిల్‌ను పసుపు పూలతో, ఆకుపచ్చ రంగులతో అలంకరించి అభిమానాన్ని చాటారు. అనంతరం నేతల ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని ఎల్‌ఈడీ స్క్రీన్‌పై చూస్తూ కేరింతలు కొట్టారు.

పామూరులోనూ సంబరాలు

పామూరు జూన్ 12 : రాష్ట్ర, ముఖ్యమంత్రిగా, చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రిగా పవన్‌కల్యాణ్‌లతో పాటు రాష్ట్ర మంత్రులుగా బుధవారం జరిగిన ప్రమాణస్వీకార మహోత్సవం జరుగుతున్న సందర్భంగా ఎన్డీయే కూటమి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ముందుగా జనసేన శ్రేణులు డీజే ఏర్పాటు చేసి పాత బస్టాండ్ కూరగాయాల మార్కెట్ వద్ద నుంచి మమ్మీడాడి సెంటర్ వరకు నృత్యాలు చేస్తు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన 100 కేజీ బాహుబలి కేక్‌ను టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కేవీ రమణయ్య, జనసేన మండల అధ్యక్షుడు దరిశి ఏడుకొండలు సంయుక్తంగా కట్‌చేసి, పంచిపెట్టారు. అనంతరం మంచికంటి రమేష్‌బాబు మిత్ర బృందం ఆధ్వర్యంలో వెయ్యి మందికి పులి హోరను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు డీవీ మనోహర్, కావిటి సుబ్బయ్య, ఎస్వీ నారాయణ, యారవ శ్రీను, షేక్ ఖాజారహంతుల్లా షేక్ గౌస్‌బాష, పందిటి హరీష్, గుంటుపల్లి శ్రీను, బి సత్యం, గుత్తి రాజా, దేవరపు మాల్యాద్రి, పిడుగు శ్రీను, పాలపర్తి రమణయ్య, కదిరి రాంబాబు, బిజెపి నాయకులు వెంకటసుబ్బయ్య, సుబ్బారావు జనసేన జిల్లా కార్యదర్శి వై రహీముల్లా, బాబురావు, షేక్ సందానిబాష, గుత్తి మహి, జి సాయితో పాటు తెలుగు హిళలు ఎం రమాదేవి, ఆవుల రమణమ్మ, ఈశ్వరమ్మ, నూర్జహాన్, పాల్గొన్నారు. కాగా మండలంలోని బొట్లగూడూరు, కంభాలదిన్నె గ్రామాల్లో చంద్రబాబు ప్రమాణస్వీకార వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడుసుమల్లి ప్రబాకర్‌చౌదరి, సర్పంచ్ వై బాల, రాయవరపు శ్రీకాంత్, కే రాజ, కే వెంకటేశ్వర్లు, కే గోపాల్, డి చలపతి, శేషాద్రి, పాల్గొన్నారు. కంభాలదిన్నె గ్రామంలో జరిగిన కార్యక్రమంలో మన్నం రమణయ్య, మాజీ సర్పంచ్ గొళ్ల మాల్యాద్రినాయుడు, ఏలూరి నరసింహారావు, గోళ్ల వీరబాబు, ఓ సుబ్బమ్మ, మహిళలు పాల్గొన్నారు.

తెలుగు మహిళలు ఆధ్వర్యంలో కేక్ కటింగ్

రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన పామూరులోని పువ్వాడి రాధకృష్ణ కన్వెన్షన్ హాలులో తెలుగు మహిళలు ప్రత్యేక కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పువ్వాడి తిరుపతమ్మ, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు బొల్లా మహాలక్ష్మమ్మ, పువ్వాడి వెంకటలక్ష్మమ్మ, నాగమణి, దేవరపు రమణమ్మ, జి సుజాత, పార్వతి, అరుణ, శాంతి, ఎం రమాదేవి, జాగదాబి రమణమ్మ, ఈశ్వరమ్మ, ఆవుల రమణమ్మ, లూనాజబిన్ నూర్జహాన్ పాల్గొన్నారు.

దర్శిలో అంబరాన్ని అంటిన సంబరాలు

దర్శి, జూన్ 12 : టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రమాణ స్వీకారం సందర్భంగా దర్శిలో సంబరాలు అంబరాన్ని అంటాయి. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు స్థానిక గడియారస్తంభం సెంటర్‌లో భారీగా హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. బాణసంచా కాల్చారు. చంద్రబాబు, మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ప్రజలు తిలకించేందుకు స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. సీఎంగా చంద్రబాబు, మంత్రులుగా పవన్‌కళ్యాణ్, నారా లోకేష్, గొట్టిపాటి రవికుమార్‌లు ప్రమాణం చేస్తున్న సమయంలో నాయకులు, కార్యకర్తలు ఆనందోత్సాహాలతో కేరింతలు కొట్టారు.

దొనకొండ మండలంలో...

దొనకొండ, జూన్ 12 : దొనకొండ, మరికొన్ని గ్రామాల్లో టీడీపీ నాయకులు బాణసంచా కాల్చి, గులాం చల్లుకుంటూ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల టీడీపీ నాయకులు వీరపనేని వెంకన్నచౌదరి, కుందుర్తి లక్ష్మణ్ మరికొందరు దొనకొండలోని ప్రధాన రోడ్డుపై అభినందనలు తెలుపుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన గొట్టిపాటి రవికుమార్, డోలా బాలవీరాంజనేయస్వామిలు రాష్ట్ర మంత్రులుగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యులు షేక్ మగ్బూల్‌అహమ్మద్ హర్షం వక్తం చేశారు.

సీఎం చంద్రబాబు ప్రమాణస్వీకారాన్ని వీక్షించిన అధికారులు

తాళ్లూరు, జూన్ 12 : టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ సీఎం, మంత్రివర్గ ప్రమాణస్వీకార మహోత్సవాన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మండల స్థాయి అధికారులు వీక్షించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎల్‌ఈడీలు ఏర్పాటు చేశారు. మండలస్థాయి అధికారులు పాల్గొని ప్రమాణస్వీకార మహోత్సవ కార్యక్రమాన్ని వీక్షించారు.రెండు రోజుగా ప్రభుత్వ కార్యాలయాలను దీపపు వెలుగులతో తీర్చిదిద్దారు.

ప్రమాణస్వీకారానికి తరలి వెళ్లిన టీడీపీ శ్రేణులు

తాళ్లూరు, జూన్ 12: సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి మండలంలోని తెలుగుతమ్ముళ్లు అధికసంఖ్యలో తరలి వెళ్లారు. తొలుత తాళ్లూరులోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలదండ వేసి నివాళులు అర్పించారు. ప్రమాణ స్వీకారానికి నేతలు బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, శాగం కొండారెడ్డి, మానం రమేష్‌బాబు, వల్లభనేని సుబ్బయ్య, గోపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, షేక్ కాలేషావలి, మేడగం వెంకటేశ్వరరెడ్డి, గొల్లపూడి వేణుబాబు, ఐ.శ్రీనివాసరెడ్డి, పిన్నిక రమేష్, కైపు రామకోటిరెడ్డి, రాచకొండ వెంకట్రావు, కుమ్మిత సుబ్బారెడ్డి తరలి వెళ్లారు.



కురిచేడులో కేక్ కట్ చేస్తున్న కూటమి నేతలు

రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, జూన్ 12 : రాష్ట్ర ప్రజల ఆకాంక్షల మేరకు కూటమి ప్రభుత్వం బుధవారం ప్రమాణస్వీకారం చేయటం ఎంతో ఆనందదాయకమని నియోజకవర్గ టీడీపీ నాయకురాలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఓ ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు, మంత్రులుగా పవన్ కళ్యాణ్, గొట్టిపాటి రవికుమార్, డోలా బాలవీరాంజనేయస్వామితో పాటు 24 మంత్రులు ప్రమాణస్వీకారం చేయటంపై హర్షం వెలిబుచ్చారు. మంత్రివర్గంలో యువతకు పెద్దపీటవేయటంతో పాటు అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించారని తెలిపారు. చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంస్వరతోముఖాభివృద్ధి చెందుతుందని ఆమె ఆకాంక్షించారు.



పామూరులో విజయోత్సవర్యాలీ నిర్వహిస్తున్న జన సేనకులు



కేక్ కట్ చేస్తున్న తెలుగు మహిళలు



తాళ్లూరులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న టీడీపీ నేతలు

కురిచేడులో కేక్ కట్ చేసిన టీడీపీ నాయకులు

కురిచేడు, జూన్ 12 : రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాబు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా కురిచేడు ప్రధాన కూడలిలో భారీ కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. నియోజకవర్గ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి సూచనలతో మండల నాయకులు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మొఘల్‌మస్తాన్‌వలి, కమతం నాగిరెడ్డి, షేక్ సునీల్, పాపిశెట్టి వెంకటరామయ్య, తల్లం సుబ్రహ్మణ్యం, మేరువ పెద్దిరెడ్డి, సుబ్రహ్మణ్యం, కాశీవిశ్వనాథరావు, బాలయ్య, దాసరి రవి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం.. భారీ కేక్ కటింగ్‌లు



ఉల్లగల్లులో కేక్ కట్ చేస్తున్న అభిమానులు

ముండ్లమూరు, జూన్ 12 : సీఎంగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయటంతో మండలంలోని పలు గ్రామాల్లో కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. బాణసంచా కాల్చారు. పెదఉల్లగల్లు బస్టాండ్ సెంటర్‌లో టీడీపీ నాయకులు ఆధ్వర్యంలో భారీ కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జిల్లెలమూడి చౌదరి, కర్నాటి విజయసాయి రెడ్డి, పెద అంజిబాబు, చిన ఆంజనేయులు, వాతల వెంకటసుబ్బారెడ్డి, కామని పూర్ణ, వలి పాల్గొన్నారు. వేములబండ, వేంపాడు, తూర్పుకంభంపాడు, సింగనపాలెం, చింతలపూడి, బొప్పూడివారిపాలేల్లో పెద్ద ఎత్తున బుధవారం రాత్రి కేక్‌లు కట్ చేశారు.

భారీగా తరలి వెళ్లిన తెలుగు తమ్ముళ్లు

సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి అన్ని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, అభిమానులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. జీపుల్లో, ద్విచక్రవాహనాల్లో మండల టీడీపీ అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావు, బిజ్జం వెంకట సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ ఇందూరి పిచ్చిరెడ్డి, మేదరమెట్ల వెంకటరావు, బద్రి గోపాలరెడ్డి, నిడమానూరి శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు కొక్కెర నాగరాజు, వరగాని పౌలు, తాతపూడి చల్లయ్య, గోపనబోయిన ఫిలిప్ రాజు తరలి వెళ్లిన వారిలో ఉన్నారు.

అటకెక్కిన నాడు-నేడు పథకం

మధ్యలో నిలిచిపోయిన పాఠశాల భవనాల నిర్మాణం

ఎప్పటికప్పుడు నిధులివ్వని వైసీపీ ప్రభుత్వం

పట్టించుకోని అధికారులు

నేటి నుంచి స్కూళ్లు పునఃప్రారంభం

మౌలిక వసతులు లేక విద్యార్థులకు ఇబ్బందులు



మధ్యలో నిలిచిపోయిన ప్రభుత్వ హైస్కూల్‌తరగతి గదుల భవనం

మరుగు దొడ్లకు తలుపులు పెట్టకుండా వదిలేయడంతో వేసిన కంప

దర్శి, జూన్ 12 : వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా చేపట్టిన నాడు-నేడు పథకం అటకెక్కింది. గత రెండు సంవత్సరాలుగా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. నిధుల కొరత, సిమెంట్ మెటీరియల్ సరఫరా లేకపోవటంతో పనులు మధ్యలోనే ఆగిపోయాయి. వైసీపీ పాలకులు ఆరంభ శూరత్వంమే తప్పసంపూర్ణంగా పూర్తి చేసిన పని ఒక్కటీ లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. వివరాల్లోకెళ్తే...

దర్శి మండలంలో నాడు-నేడు పథకం రూ.18.48కోట్లతో పలు పనులు చేపట్టారు. 25 పాఠశాల గదులు, 10 ప్రహరీగోడలు, 9వంటగదులు, నిర్మాణాలు చేపట్టారు. అదే విధంగా 16 పాఠశాలలకు విద్యుత్తు పరికరాలు, ఫ్యాన్లు ఏర్పాటు, 16 పాఠశాలల్లో మంచినీటి వసతి ఏర్పాట్లు, 15పాఠశాలల్లో ఫర్నీచర్ ఏర్పాటు పనులు ఆరంభించారు. 7 అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం చేపట్టారు. ఈ పనులన్నీ మధ్యలోనే నిలిచిపోయాయి. కొన్ని చోట్ల శ్లాబులు వేసి వదిలి వేశారు. మరికొన్ని చోట్ల పిల్లర్స్ వేసి వదిలేశారు. మరుగుదొడ్లకు తలుపులు, నీటి వసతి ఏర్పాటు చేయలేదు. మంచి నీటి వసతి గురించి పట్టించుకోలేదు. అనేక పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు లేక అధ్వానంగా ఉన్నాయి. గురువారం నుంచి విద్యాసంవత్సరం ఆరంభమవుతుంది. పాఠశాలల్లో పనులు ఎక్కడ వేసిన గొంగళిఅక్కడే అన్న చందంగా నిలిచిపోవటంతో విద్యార్థులు మౌలిక వసతులు లేక ఇబ్బందులుపడే పరిస్థితి నెలకొంది. వైసీపీ పాలకుల నిర్లక్ష్యం వల్లనే ఈ పథకం అస్తవ్యస్తంగా మారిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చేపట్టిన పనులకు నిధులు విడుదల చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని నిర్వాహకులు వాపోతున్నారు. అధికారులు ఏమి చేయాలో దిక్కుతోచక మౌనంగా ఉన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పాటయితేనే ఈ పనులకు కదలిక వచ్చే అవకాశం ఉందని ప్రజలు ఆశాభంగం వ్యక్తం చేస్తున్నారు.

పాలసీదారులకు అవగాహన కల్పించిన అధికారులు

ముండ్లమూరు, జూన్ 12 : మండలంలోని ఈదర పంజాబ్ నేషనల్ బ్యాంక్ వద్ద బుధవారం పీఎన్‌బీ మెర్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీదారుల సమస్యల పరిష్కార శిబిరం జరిగింది. ఈ సందర్భంగా పాలసీదారులకు ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో సెల్‌ఫోన్ నుంచి ప్రీమియం చెల్లింపు, పాలసీ వివరాల పరిశీలన, రుణాలు పొందటం, పాలసీలో మార్పులు, స్వతంత్రంగా చేసుకొనే విధానాన్ని తెలియజేశారు. ఈ కృషి యాప్ వినియోగంపై గుంటూరు పీఎన్‌బీ మెంట్ లైఫ్ కస్టమర్ సర్వీసు మేనేజర్ ఎస్‌కే ఇమ్రాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ సీహెచ్ సునీల్, డిప్యూటీ మేనేజర్ నాగరాజు, చీఫ్ ఇన్సూరెన్స్ మేనేజర్ ఈమని వెంకటరెడ్డి, ఎల్‌పీఎం ఎస్ కోటేశ్వరమ్మ, ఎస్ అంకమరావు, గోగుల శివ రామకృష్ణ, అబ్బని వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





సీఎంగా ప్రమాణం చేస్తున్న చంద్రబాబునాయుడు



చంద్రుడి పట్టాభిషేకానికి..

ప్రభంజనం

- కేసరపల్లికి భారీగా కూటమి శ్రేణులు
- కార్యకర్తలతో కిక్కిరిసిన.. ఎన్‌హెచ్ - 16

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/గన్నవరం): చంద్రుడి పట్టాభిషేకానికి జన ప్రభంజనం తోడైంది. ప్రమాణ స్వీకారమహోత్సవానికి ఊరూ వాడా ఏకమై కేసరపల్లికి కదలి వచ్చింది. ప్రమా ణస్వీకారం ముగిసే వరకు కూడా ప్రజలు ప్రవాహంలా వస్తూనే ఉన్నారు. తొక్కిసలాట లకు ఆస్కారం లేకుండా జాతీయ రహదారిపై పోలీసు లు బారీకేడ్లు ఏర్పాటు చేసి నిలువరించే ప్రయత్నం చేసినా.. తమ అభిమాననేతను చూడ నివ్వరా అంటూ వాటిని తోసుకుని మరీ చొచ్చుకు వచ్చారు. అరలక్ష మందికి మాత్రమే గ్యాలరీలు ఏర్పాటు చేసినా.. మరో లక్ష మంది జనం అదనంగా తరలి వచ్చారు. వచ్చేవాళ్ళు, వెళ్ళేవాళ్ళ తో జాతీయ రహదారి ఎన్‌హెచ్ - 16 రద్దీగా మారి పోయింది. పాస్‌లున్న వీవీఐపీలు, వీఐపీలు గ్యాలరీల్లో కూర్చునే అవకాశం దక్కలేదు. అయినా తమ అభి మాన నేత కోసం నుంచుని ఎల్ ఈడీ స్ర్కీన్ల మీద వీక్షించారు. ప్రమాణ స్వీకారాన్ని ప్రత్యక్షంగా వీక్షిం చటం సాధ్యం కాని వారంతా జాతీయ రహదారి వెంబడి ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్ర్కీన్లపై కార్యక్ర మాన్ని వీక్షిం చారు. ప్రతి ఎల్‌ఈడీ స్ర్కీన్ దగ్గర టెంట్లు ఏర్పా టు చేయటంతో ప్రజలు అక్కడే కూర్చుని ప్రమాణ స్వీకారం ఆద్యంతం వీక్షించారు. ఎల్‌ఈడీ స్ర్కీన్ల దగ్గర ఉన్న జనాలు కూడా మినీ సభలను తలపించాయి.

అమాత్యులయ్యారు..

- మూడు జిల్లాలు.. నలుగురు మంత్రులు
- ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ముగ్గురికి చోటు
- బాపట్ల జిల్లా నుంచి గొట్టిపాటి రవికి అవకాశం
- ఊరూ వాడా ప్రమాణ స్వీకారోత్సవ సంబరాలు

..అనే నేను అంటూ ముఖ్యమంత్రిగా చంద్రబాబు, మంత్రుల ప్రమాణ స్వీకారాలను జిల్లావ్యాప్తంగా తిలకించిన కూటమి శ్రేణుల, సామాన్య ప్రజల సంబరాలు అంబరాన్ని అంటాయి. తొలుత చంద్రబాబు అనం తరం మంత్రులు కృష్ణా జిల్లా కేసరపల్లిలో బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. అదే సమయంలో ప్రమాణ స్వీకారోత్స వాన్ని ప్రజలు తిలకించేందుకు ఎక్కడికక్కడ ముఖ్య కూడళ్లలో ప్ర భుత్వం ఎల్‌ఈడీ స్ర్కీన్లు ఏర్పాటు చేసింది. చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా తమ నేతల ప్రమాణ స్వీకారాలను కేరింతలు కొడుతూ తిలకించారు. ఇక ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ముగ్గురికి, బాపట్ల జిల్లా పరిధి నుంచి ఒకరికి మంత్రి వర్గంలో చోటుదక్కింది. టీడీపీ తరఫున పోటీ చేసి ఎమ్మెల్యేలుగా గెలిచిన లోకేశ్(మంగళగిరి) అన గాని సత్య ప్రసాద్ (రేపల్లె), గొట్టిపాటి రవికుమార్(అద్దంకి), జనసేన నుంచి పోటీ చేసిన నాదెండ్ల(తెనాలి)లను చంద్రబాబు తన మంత్రి వర్గంలో చేర్చుకున్నారు. వీరి చేత గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రమాణ స్వీకారం చేయించారు. అదే సమయంలో వారివారి నియోజక వర్గాలతో పాటు జిల్లా వ్యాప్తంగా కూటమి శ్రేణులతో పాటు సామాన్య ప్రజలు కూడా మిఠాయిలు పంచుకుని టపాకాయలు కాల్చి ఆనందోత్సాహాలు ప్రదర్శించారు. తమ నేతల కష్టానికి తగిన ప్రతిఫలం దక్కిందని మంత్రుల అభిమానులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

మంగళగిరి, రేపల్లె / గుంటూరు, బాపట్ల, తెనాలి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు ముఖ్యమంత్రిగా బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన మంత్రి వర్గంలోకి గుంటూరు నుంచి ఇద్దరు, బాపట్ల జిల్లా నుంచి ఇద్దరికి చోటు దక్కింది. మొత్తంమీద మూడు జిల్లాలు నలుగురికి మంత్రి పదవులు దక్కాయి. కృష్ణా జిల్లా కేసరపల్లి వేదికగా వీరింతా బుధవారం మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. అదే సమయంలో ఆయా నియోజక వర్గాలతో పాటు జిల్లా వ్యాప్తంగా సంబరాలు మిన్నంటాయి. గత టీడీపీ ప్రభుత్వంలో లోకేశ్ మంత్రి పదవిని చేపట్టారు. ప్రజా క్షేత్రంలో గెలవాలన్న ఆయన కలను మంగళగిరి వాసు లు ఈ సారి నెరవేర్చారు. అత్యధిక మెజార్టీతో గెలిచిన లోకేశ్‌ను చంద్ర బాబు మంత్రిగా ఎంపిక చేశారు. సామాజిక సమీకరణలో భాగంగా బీసీలకు పెద్ద పీట వేయాలని చంద్రబాబు భావించడంతో అనూహ్యంగా అనగాని సత్యప్రసాద్‌ను అదృష్టం వరించింది. సత్యప్రసాద్ రేపల్లె ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయాలు నమోదు చేసి మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు. వరుసగా ఐదుసార్లు గెలిచి ఓటమెరుగని నేతగా గుర్తింపు పొందిన అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ కష్టాన్ని గుర్తించిన చంద్రబాబు ఆయన్ను మంత్రి వర్గంలోకి తీసుకున్నారు. వీరిద్దరూ కూడా మంత్రి పదవులు పొందడం తొలి సారి కావడం విశేషం. చంద్రబాబు నూతన మంత్రివర్గంలో తెనాలికి ప్రాధాన్యం ఇచ్చారు. మంత్రివర్గంలో జనసేన నుంచి ముగ్గురికి చోటు ఇవ్వగా వారిలో నాదెండ్ల మనోహర్ ఒకరు. మొదటి నుంచి మంత్రివర్గంలో మనోహర్‌కు స్థానం ఉంటుందన్న ఊహగానాలు రాగా, దానిని నిజం చేస్తూ చంద్రబాబు అవకాశం కల్పించారు.



రేపల్లె రాజ్యలక్ష్మీ థియేటర్ సెంటర్‌లో అనగానికి మంత్రి పదవి కేటాయించటంతో టపాసులు పేలుస్తున్న తేదేపా నాయకులు

లోకేశ్.. రెండో సారి..ఎన్నో లక్ష్యాలు



మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేశ్ రాష్ట్ర మంత్రిగా బాధ్యతలను చేపట్టడం ఇది రెండోసారి. మంగళగిరి నుంచి ఎమ్మెల్యేలుగా మంత్రి పదవులు నిర్వహించిన వారిలో లోకేశ్ మూడో వ్యక్తి. లోకేశ్ 2016లో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, ఐటీశాఖమంత్రి శాఖలను నిర్వహించారు. మంగళగిరిలో ఐటీ పార్కును ఏర్పాటు చేయించి కొన్ని ఐటీ పరిశ్రమలను మంగళగిరి, గన్నవరం ప్రాంతాలకు తీసుకొచ్చారు. మంగళగిరిని ఐటీ హబ్‌గా, మరో గచ్చిబౌలిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేశారు. మంగళగిరి నియోజకవర్గంపై అవగాహన ఏర్పాటు చేసుకున్న లోకేశ్ దేశంలోనే మంగళగిరిని ఓ ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలనే పట్టుదలతో ఉన్నారు. ఈ పరిస్థితుల్లో ఆయన మంత్రి కావడం మంగళగిరి ప్రజల అదృష్టంగానే భావించాలి. లోకేశ్.. తనకు 53,350 ఓట్ల మెజారిటీ కావాలని అభ్యర్థించగా 91,500 ఓట్ల రికార్డు మెజారిటీని ఇచ్చి ఘనంగా ఆశీర్వదించారు. దీంతో మంగళగిరి అభివృద్ధిపై లోకేశ్ పట్టుదల మరింతగా పెరిగింది. మంగళగిరిలో సాధ్యమైనన్నీ ఐటీ పరిశ్రమలను నెలకొల్పడంతో పాటు ఇతర ఉపాధి పరిశ్రమలను ప్రోత్సహించాలని లోకేశ్ భావిస్తున్నారు. మంగళగిరిని గోల్డ్‌హబ్‌గా మార్చి వేలాదిమంది స్వర్ణకారులకు చేతినిండా పని కల్పించేలా చర్యలు చేపట్టనున్నారు. చేనేత ఉత్పత్తులకు జాతీయస్థాయిలో మంచి ప్రాచుర్యాన్ని తీసుకురావడంతోపాటు మరిన్ని వీవర్స్‌శాలలను స్థాపించి నేతన్నలను అన్నీవిధాలుగా ఆదుకునేందుకు కార్యాచరణను చేపట్టారు. మంగళగిరి శ్రీలక్ష్మీ నృసింహస్వామివారి దేవస్థానాన్ని ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించుకుంటున్నారు.

నాడు స్పీకర్.. నేడు మంత్రిగా నాదెండ్ల



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన సభ మాజీ సభాపతిగా చేసిన నాదెండ్ల మనోహర్‌కు నూతన మంత్రి వర్గంలో మంత్రిగా పదవి లభించింది. మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు కుమారుడైన మనోహర్ రాజకీయ పరంగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తెనాలి నుంచి మూడోసారి విజయం సాధించిన మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్‌కు మంత్రిగా అవకాశం దక్కటంతో తెనాలిలో ఆనందం వెల్లువెత్తుతోంది. 2004 నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టిన మనోహర్ తొలిసారిగా 2004 ఎన్నికల్లో తెనాలి నుంచే కాంగ్రెస్ తరఫున పోటీ చేసి విజయం సాధించారు. 2009 లోనూ కంగ్రెస్ తరపునే పోటీలో నిలిచి రెండోసారి కూడా విజయాన్ని దక్కించుకున్నారు. అప్పుడే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభకు స్పీకర్‌గా వ్యవహరించారు. రాష్ట్ర విభజన తర్వాత 2014 ఎన్నికల్లో ఆయన అపజయం పొందారు. 2019 ఎన్నికల నాటికి జనసేనలో చేరి, పోటీలో నిలిచి ఓడిపోయారు. 2024 ఎన్నికల్లో కూటమి తరఫున తెనాలి సీటును దక్కించుకున్న ఆయన గతంలో తెనాలి ఎన్నికల చరిత్రలో ఎవరికీ దక్కనంతగా 48,112 మెజారిటీ సాధించారు.

తీర ప్రాంతం నుంచి అనగానికి..



హ్యాట్రిక్ ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్‌కు అమాత్య యోగం దక్కింది. బీఎస్సీ కంప్యూటర్స్ చదవిని సత్యప్రసాద్ మాజీ ఆర్థిక మంత్రి అనగాని భగవంతరావు సోదరుడు రం గారావు కుమారుడు. తీర ప్రాంత నియోజకవర్గమైన రేపల్లె నుంచి సత్య ప్రసాద్ 2014, 2019, 2024లో వరుస విజయాలతో హ్యాట్రిక్ సాధించారు. బాపట్ల జిల్లా పరిధి లోనే అన గాని 40వేల పైచిలుకే అత్యధిక మెజార్టీతో ఘన విజయం సాధించారు. సత్యప్రసాద్‌కు మంత్రిగా అవకాశం దక్కడంతో తీర ప్రాం త వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2019లో వైసీపీ సునామీలో కూడా రేపల్లె నుంచి ఆయన అత్యధిక మెజార్టీతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో విజయకేతనం ఎగురవేశారు. తీర ప్రాంతంలో అప్పట్లో కూ చినపూడి నుంచి టీడీపీ తరఫున గెలిచిన ఈపూరి సీతారావమ్మ మంత్రి పదవి నిర్వహించగా ఆ తర్వాత కూటమి ప్రభుత్వంలో రేపల్లె నుంచి గెలిచిన సత్యప్రసాద్‌కు మం త్రి పదవి దక్కింది.

ఓటమెరుగని రవి.. మంత్రిగా..



ఓటమెరుగని నేతగా కీర్తి గడించిన అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ తొలిసారిగా చంద్రబాబు మంత్రివర్గంలో చోటు దక్కింది. వైసీపీ హయాంలో ఆయనను రకరకాలుగా వేధిం చారు. క్వారీలు మూయించారు.. వందల కోట్ల జరిమానాలు విధిం చారు.. కేసులు పెట్టారు.. పార్టీ మారాలని అనేక రకాలుగా ఒత్తిళ్లు పెట్టారు.. వైసీపీ వేధింపుల ధాటికి పూర్తిగా వ్యాపారాల నుంచే తప్పుకునే పరిస్థితి రవికుమార్‌కు ఏర్పడింది. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అన్నింటినీ తట్టుకుని నిలబడ్డారనే పేరును అటు కార్యకర్తల్లోనూ, ఇటు పార్టీ అధినేత దగ్గర రవికుమార్ తెచ్చుకోగలిగారు. గొట్టిపాటి కష్టాలను గుర్తించిన చంద్రబాబు ఆయనకు మంత్రి పదవి కట్టబెట్టారు. అద్దంకి నుంచి గొట్టిపాటి వరుసగా ఐదోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. 2004లో మార్టూరు నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా గొట్టిపాటి అసెంబ్లీలోకి అడుగు పెట్టారు . నియోకవర్గాల పునర్విభజన అనంతరం అద్దంకి నుంచి 2009, 2014, 2019, 2024లో గెలుపొందారు.

చంద్రబాబు ప్రమాణాన్ని తిలకించి..పులకించారు

- స్క్రీన్‌పై చూసి కేరింతలు కొట్టిన మహిళలు
- పలుచోట్ల శ్రేణుల సంబరాలు

అద్దంకి, జూన్ 12 : మంత్రివర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాలను వీక్షించేందుకు అద్దంకి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణ లో ఏర్పాటు చేసిన స్క్రీన్ పై ఎబిఎన్ లో వచ్చిన లైవ్ ను పెద్ద ఎత్తున మహిళలు, టీడీపీ శ్రేణులు హాజరై తిలకించారు. అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మంత్రిగా ప్రమాణం చేసే సమయంలో ఒక్కసారిగా మున్సిపల్ కౌన్సిలర్‌లు, శ్రేణులు లేచి నిలబడి కేరింతలు కొట్టారు. కౌన్సిలర్‌లు కంపా రజనీ, రంగిశెట్టి సుభాషిణి, విజయలక్ష్మి, రమేష్, మాగులూరి తిరుపతమ్మ, జహీరా, సీతమ్మ, కమీషనర్ సత్యనారాయణ, మేనేజర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. ఇళ్ళ లో సైతం రవికుమార్ ప్రమాణాన్ని టీవీల ద్వారా వీక్షించారు. కూడళ్లలో బాణ సంచా కాల్చారు. దీంతో అద్దంకి పట్టణం మొత్తం పులకించింది.

సంతమాగులూరు నుంచి..

సంతమాగులూరు : ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా సంతమాగులూరు మండలం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి కూటమి శ్రేణులు పుట్టావారిపాలెం అడ్డరోడ్డుకు చేరుకుని అక్కడి నుంచి ర్యాలీగా కృష్ణాజిల్లా గన్నవరం వద్ద కేసరపల్లికి చేరుకున్నారు.

తిలకిస్తున్న ప్రజలు

పంగులూరు : ముఖ్యమంత్రిగా చంద్రబాబుతో పాటు మంత్రుల ప్రమాణ స్వీకారోత్సవాన్ని ప్రజలు ఆసక్తిగా తిలకించారు. కొ న్ని గ్రామాలలో టీడీపీ నేతలు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని లైవ్ టెలికాస్ట్ ద్వారా చూసేందుకు ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌కు మంత్రి పదవి లభించడంపై ప్ర జలు హర్షం వ్యక్తం చేశారు. తమ ప్రియతమ నేత ప్రమాణాన్ని చూసేందుకు పలువురు విజయవాడ వెళ్లారు.

చినగంజాంలో..

చినగంజాం : గ్రామ పంచాయతీ, ఎపీఈడీవో కార్యాలయం, పలు చోట్ల ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ టీవీలలో చంద్రబాబు ప్రమాణ స్వీ కారోత్సవాన్ని అధికారులు, ప్రజలు తిలకించారు. తహసీల్దార్ జీవీఎస్ ఫణీంద్రబాబు, ఎంపీడీవో యూబీ వరప్రసాద్, ఎస్‌ఐ శ్రీనివాసరావు, అధికారులు, వీఆర్వోలు, టీడీపీ నాయకులు శ్రీనివాసరావు, సంతరావూరు, చినగం జాం తదితర గ్రామాల్లో యార్లగడ్డ లక్ష్మి, సురేష్, నాగరాజు, సర్పంచ్ రాయని చిన్న తిలకించారు. కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని బా గ్యనగర్‌లో టీడీపీ గ్రామ అధ్యక్షుడు రేవు నాం చార్లు కేక్ కట్‌చేసి సంబరాలు నిర్వహించారు.

చంద్రబాబు ప్రమాణస్వీకారోత్సవానికి టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో నాయకులు టీ.జయరావు, వెంకయ్య అజాద్, కత్తి లాజర్, వెంకటరావు, రాజశేఖర్, నరహరిగోపి, వెంకటేశ్వరరావు, అనంత వెంకటేశ్వరారవు, మహేష్, వి శ్వేశ్వరరావు, గంటా నరసింహారావుకు ఎంపీడీ వో వరప్రసాద్ పాసులు అందజేయగా వెళ్లారు.

చీరాలలో ఏర్పాట్లు

చీరాల, జూన్ 12 : ఎన్ఆర్ పీఎం హైస్కూల్ ప్రాంగణంలోని ఓపీటీ (ఓపెన్ ఎయిర్ థియేటర్లో) బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని తిలకించేందుకు ఎల్‌ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. ఉద్యోగులు, కూటమి శ్రేణులు కార్యక్రమాన్ని వీక్షించాయి. ఈ ప్రత్యేక కార్యక్రమానికి నియోజవకర్గ ప్రత్యేక అధికారిగా డీఎస్‌వో విలియమ్స్ బాధ్యతలు నిర్వర్తించారు. సొంత వాహనాల్లో మరికొందరు వెళ్లారు. పాసులు అందనివారు కొందరు కార్యక్రమానికి హాజరయ్యేందుకు తరలివెళ్లారు. ట్రాఫిక్ నేపథ్యంలో కొందరు చేరలేకపోయామ ని చెప్పారు. టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన ముఖ్యులు వెళ్లగా, ఆహ్వాన పాసులు అం దని కొందరు అసంతృప్తి చెందారు.

మార్టూరులో..

మార్టూరు : ముఖ్యమంత్రిగా చంద్రాబు ప్రమాణాన్ని మండల టీడీపీ శ్రేణులు ఎల్‌ఈడీ టీవీల్లో తిలకించారు. ఎంఈవో కార్యాల యం, మార్కెట్ యార్డులో ఉన్న రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన టీవీలలో ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకించి ఆనందించారు. నాగరాజుపల్లిలోని సచివాలయంలో ప్ర సారం చూసేందుకు వచ్చిన వారికి స్వీట్లు పంపిణీ చేశారు. బాణసంచా కాల్చి నినాదాలు చేశారు. అన్ని గ్రామాల్లో కూటమి శ్రేణులు ప్రమాణస్వీకారోత్స వాన్ని చూశారు.

పర్చూరు : ముఖ్య మంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ప్రజలు బుధవారం ఉత్సాహంగా వీక్షించారు. బొమ్మల సెంటర్ కూడలిలో ప్రజలు వీక్షించేందుకు భారీ స్కీన్‌లను ఏర్పాటు చేశారు.


అద్దంకి మున్సిపల్ కార్యాలయంలో బాబు ప్రమాణాన్ని చూస్తున్న ఉద్యోగులు, మహిళలు


కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ కౌన్సిలర్‌లు, టీడీపీ నేతలు


విజయవాడకు తరలివెళ్తున్న సంతమాగులూరు, చినగంజాం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు


బొమ్మల సెంటర్‌లో ప్రమాణస్వీకారాన్ని వీక్షిస్తున్న ప్రజలు


సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి

నమ్మకాన్ని నిలబెట్టుకుంటా

మంత్రి రవికుమార్

అద్దంకి, జూన్ 12 : తనకు మంత్రి పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు 5సార్లు ఎమ్మెల్యేగా తనను గెలిపించిన మార్టూరు, అద్దంకి నియోజకవర్గ ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని మంత్రి, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మంత్రిగా ప్రమాణం చేసిన తరువాత ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి వరుసగా గెలిపిస్తూ ఆదరించిన రెండు నియోజకవర్గాల ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా తన శక్తి మేర అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్రాభివృద్ధిలో పాలుపంచుకునే అవకాశం కలగటం అదృష్టంగా భావించి అవసరమైన మేరకు పనిచేస్తానన్నారు. అద్దంకి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతానన్నారు. మంత్రిగా ఎదిగేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

బడిఈడు పిల్లలను చదివించండి

చీరాలటౌన్, జూన్ 12 : బడి ఈడు పిల్లలను తల్లిదండ్రులు కచ్చితంగా చదివించాలని తద్వారా వారు ఉన్నతంగా ఎదుగుతారని ఎంఈవో-2 సుధారాణి పేర్కొన్నారు. బుధవారం చీరాల మండల పరిధిలోని సీతానగర్ ఎంపీపీ స్కూల్‌లో పేరెంట్స్ కమిట ఆధ్వర్యంలో తల్లిదండ్రులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న పథకాలను వివరించారు. గురువారం నుంచి పాఠశాలలు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ పాఠశాలకు హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టీడీపీ నేత దశరథరామయ్య మృతి


దశరథరామయ్య

పంగులూరు, జూన్ 12 : చందలూరు గ్రామ పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, టీడీపీ మండల నాయకుడు బెల్లంకొండ దశరథరామయ్య (66) బుధవారం ఉదయం మరణించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రామయ్య రాయవేలూరు వైద్యశాలలో చికిత్స పొందుతూ బుధవారం కన్నుమూశారు. ప్రజా సేవలో అందరికీ అందుబాటులో ఉంటూ వివాదరహితునిగా, సౌమ్యుడిగా పేరు పొందారు. ఆయన మృతితో గ్రామంలో విషాదం అలముకుంది. దశరాథరామయ్య అంత్యక్రియలు గురువారం ఉదయం చందలూరులో జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు.

దోమల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

ఇంకొల్లు, జూన్ 12 : విషజ్వరాలబారిన పడకుండా దోమల నివారణకు జాగ్రత్తలు పాటించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డా.అంజలి సూచించారు. మలేరియా మాసోత్సవం సందర్భంగా ఆమె పలు సూచనలు చేసారు. సీజనల్‌వారీగా వచ్చే విషజ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, తొట్లను వారంవారం శుభ్రం చేయాలని, దోమతెరలను వాడాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో కోటేశ్వరరావు, ఏఎన్‌ఎంలు, ఆశా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇడుపులపాడులో నేడు విద్యుత్ కోత

ఇంకొల్లు, జూన్ 12 : ఇంకొల్లు మండలంలోని ఇడుపులపాడు సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రామకృష్ణ తెలిపారు. సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా ఇడుపులపాడు, నాగండ్ల, సూదివారిపాలెం, సుబ్బారెడ్డిపాలెం, అంకిరెడ్డిపాలెం, పూసపాడు, వంకాయలపాడు, దగ్గుబాడు గ్రామాలలో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రజాప్రయోజనాలే లక్ష్యం : ఆమంచి

వేటపాలెం(చీరాల), జూన్ 12 : ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా పనిచేద్దామని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. పందిళ్లపల్లిలోని తన నివాసంలో బుధవారం నాయకులు, కార్యకర్తలతో ఆమంచి సమీక్ష నిర్వహించారు. ఎన్నికలలో గెలుపు, ఓటములు సహజమన్నారు. అయితే ప్రజలకు మెరుగైన సేవలు అందేందుకు మనవంతు కర్తవ్యం నిర్వర్తించాలన్నారు. ఎన్నికల కోసం కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అందుకు సంబంధించి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంసెట్‌లో ఇంకొల్లు విద్యార్థుల ప్రతిభ

ఇంకొల్లు, జూన్ 12 : ఎంసెట్ ఫలితాల్లో ఇంకొల్లు ఆదర్శ విద్యార్థులు మంచి ర్యాంక్‌లు సాధించి ప్రతిభ కనబరిచారని ఆదర్శ జూనియర్ కళాశాల కరెస్పాండెంట్ తోటకూర విజయభాస్కర్ తెలిపారు. జే కార్తీక్ 7,456, పీ పవిత్ర 11,443, పీ విష్ణుప్రియ 21,549 ర్యాంకులు సాధించగా, వారిని అభినందించారు.

ప్రమాణ స్వీకారోత్సవ పండగ

- గ్రామాల్లో భారీగా భోజనాలు
- భారీ ఎల్‌ఈడీ స్క్రీన్ల ఏర్పాటు
- మేదరమెట్లలో శ్రేణుల బైక్‌ర్యాలీ

మేదరమెట్ల, జూన్ 12: ముఖ్యమంత్రిగా టీడీపీ అధినేత చంద్రబాబు ప్రమాణస్వీకారం నేపథ్యంలో బుధవారం కొరిశపాడు మండలంలో పండగ వాతావరణం నెలకొంది. పలుగ్రామాల్లో తెలుగు దేశం పార్టీ శ్రేణులు కేక్ కటింగ్‌లతో పాటు భారీగా భోజనాలు ఏర్పాటు చేశారు. అలాగే అక్కడ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. కేరింతలు కొట్టారు. మేదరమెట్లలోని ప్రైవేటు కల్యాణ మండపంలో మండల పరిషత్ అధికారులు, టీడీపీ కేడర్ కలిసి భారీ ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని వీక్షించారు. బాబు, అద్దంకి ఎమ్మెల్యే రవికుమార్ ప్రమాణ స్వీకారం చేసేటప్పుడు కార్యకర్తలు చప్పట్లు ఈలలతో హాల్ మార్మోగిపోయింది. అనంతరం అధికారులకు, కార్యకర్తలకు భోజనాలు అందజేశారు. సాయంత్రం మేదరమెట్లలో యువకులు, గ్రామస్థులు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సమతావాణి, ఎమ్మార్వో బీ.సుశీల ఇతరు అధికారులతోపాటు టీడీపీ సీనియర్ నాయకులు మన్నే రామారావు, పార్టీ మండల అధ్యక్షులు జాగర్లమూడి జయకృష్ణ, మేదరమెట్ల శ్రీనివాసరావు, చెన్నుపాటి హరిబాబు, మందా నాగేశ్వరరావు, చింతం సుబ్బారావు, సాదినేని మస్తాన్‌రావు, జాగర్లమూడి వీరాంజనేయులు, తల్లపనేని శ్రీనివాసరావు, ఆర్.బ్రహ్మ య్య, చావా రాజేష్, నాదేండ్ల కోటేశ్వరరావు, బాలినేని కిషోర్ పాల్గొన్నారు.


ప్రమాణాన్ని వీక్షిస్తున్న అధికారులు, టీడీపీ నాయకులు

రావినూతలలో ఘనంగా..

రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ క్రికెట్ గ్రౌండ్‌లో తెలుగుదేశం పార్టీ నేతలు ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మంత్రిగా ప్రమాణం చేసిన నేపథ్యంలో కేక్ కట్ చేసి అందరికీ పంచారు. పరస్పరం అభినందనలు తెలుపుకున్నారు. అలాగే 800 మందికిపైగా భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కారసాల నాగేశ్వరరావు(బాబు), మోపర్తి లక్ష్మీనారాయణ, అనుబ్రోలు ప్రభాకర్ పాల్గొన్నారు.

పాత శివాలయంలో మొక్కులు తీర్చుకున్న శ్రేణులు



అద్దంకి, జూన్ 12 : టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం, అద్దంకి ఎమ్మెల్యేగా గొట్టిపాటి రవికుమార్ మరోసారి విజయం సాధించటం, మం త్రిగా ప్రమాణం చేయటం తో అద్దంకి పట్టణంలోని పలువురు పాత శివాలయంలో మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలోని 13 వ వార్డు కు చెందిన యువతి శ్రీవల్లి బుధవారం పాత శివాలయంలో 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. 18వ వార్డు కు చెందిన టీడీపీ నేత స్వరాజ్‌కుమార్ కూడా పాత శివాలయం లో 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు.



చంద్రబాబు అనే నేను..





వేదిక ముందు నందమూరి, నారా కుటుంబ సభ్యులతో హీరో రామ్‌చరణ్

ప్రభంజనమై మేమూ..

ప్రజాతీర్పునకు పట్టాభిషేకమైంది. జనం ప్రభంజనమై పండుగలా కదిలింది. అభిమాన కోలాహలం నడుమ కేసరపల్లి జయకేతనమై ఎగరగా, గన్నవరం జనవరమై జేజేలు పలికింది. 'నారా చంద్రబాబు నాయుడు అను నేను..' అనే మాటతో అభిమాన సంబరాలు అంబరాన్నంటాయి. కేసరపల్లిలో బుధవారం ఉదయం జరిగిన టీడీపీ కూటమి ప్రమాణస్వీకార మహోత్సవానికి అతిరథ మహారథులు హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సినీ ప్రముఖులు రజనీకాంత్, చిరంజీవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

కేసరపల్లిలో ఘనంగా టీడీపీ కూటమి మహా పట్టాభిషేకం

బస్సెక్కిన అభిమానం









చంద్రబాబు ప్రమాణస్వీకారం చేస్తుండగా నందమూరి రామకృష్ణ భావోద్వేగం, బాలకృష్ణ, భువనేశ్వరి అనురాగం, సభావేదిక వద్ద నాగలితో ఓ రైతు ప్రదర్శన



వేదికపై బాలకృష్ణ, రజనీకాంత్ దంపతులు, చిరంజీవి



జనసేన, టీడీపీ, బీజేపీ స్టిక్కరింగ్ స్కూటర్లపై వినూత్నంగా..

రామాపురంలో తాడేపల్లిగూడెం విద్యార్థి మృతి

స్నేహితులతో వచ్చి అనంతలోకాలకు

ఇదే ప్రాంతంలో రెండురోజుల క్రితం ఒకరు మృతి



కనగళ్ల గౌరీష్ (ఫైల్)

రామాపురం(చీరాలటౌన్), జూన్ 12 : రామాపురం సముద్రతీరంలో వరుస ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. రెండు రోజుల కిందట అదే ప్రాంతంలో చీరాల మండలానికి చెందిన కాటి జయపాల్(18) స్నేహితులతో కలిసి సరదాగా ఈతకు వచ్చి మృత్యువాత పడగా, తాజాగా మరో ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పరిధి కె.పెంటపాడుకు చెందిన కనగళ్ల గౌరీష్(21) చెన్నై ఎంజీఆర్‌లో బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి కేవీ సత్యనారాయణ సేల్స్‌మెన్‌గా పనిచేస్తు కుమారుడిని చదివించుకుంటున్నారు. బుధవారం తెల్లవారు జామున విజయవాడలో ఉంటున్న స్నేహితులు సృజన్, అభినవ్, హరీష్, అయాన్‌తో కలిసి రామాపురం సముద్రతీరానికి బైక్‌లపై వచ్చారు. ఉదయం 6 గంటలకే సముద్రంలోకి దిగారు. కొద్దిసేపటికే అలల తాకిడికి గౌరీష్, సృజన్, అభినవ్, అయాన్ కొట్టుకుపోబోయారు. అదృష్టవశాత్తు ముగ్గురు ఒడ్డుకు చేరగా గౌరీష్ లోపలకు కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. దీంతో మిత్రులు పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు గాలింపు చర్యలు ప్రారంభిస్తుండగానే అదే ప్రాంతంలో గౌరీష్ విగతజీవిగా ఒడ్డుకు చేరాడు. సమాచారం అందుకున్న వేటపాలెం పోలీసులు కేసు నమోదుచేసి, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. అయితే కుమారుడు విగతజీవిగా ఉండటాన్ని చూసిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు హాస్పిటల్ వద్ద బోరున విలపించారు.

రెండు రోజుల్లో వస్తానని తల్లికి ఫోన్

గౌరీష్ ఈనెల 2వ తేదీన విజయవాడలోని మిత్రుడు సృజన్ వద్దకు వచ్చి అక్కడే ఉంటున్నాడు. తల్లిదండ్రులకు మాత్రం చెన్నైలోనే ఉన్నట్లు ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. మంగళవారం రాత్రి తల్లికి ఫోన్ చేసి చాలాసేపు మాట్లాడాడు. రెండు రోజుల్లో వస్తానని ఫోన్ ముగించాడు. ఈలోపు తెల్లారేసరికి కుమారుడి మరణవార్త విన్న తల్లి శోకసంద్రంలో మునిగిపోయింది.

నిత్యం ప్రమాదాలే!

వాడరేవు, రామాపురం సముద్రతీరాల్లో నిత్యం ప్రమాదాలు పెరుగుతూనే ఉన్నాయి. పోలీసులు పటిష్టమైన చర్యలు చేపట్టినప్పటికీ ప్రైవేటుగా యువకులు మునిగేందుకు ఈ డేంజర్ జోన్‌లను ఎంచుకుంటూ ప్రమాదాలబారిన పడుతున్నారు. సముద్రంలో అత్యుత్సాహంతో ఫీట్‌లు వేయడం, మద్యం సేవించి ఈతకు దిగుతుండడంతో మృత్యువాత పడుతున్నారు. అంతేకాకుండా సముద్ర విస్తీర్ణం అధికం కావడంతో కొంతమేరకు పర్యవేక్షణ కూడా కష్టతరంగా మారింది. ఈనేపథ్యంలో పోలీసులు ఎంత జాగ్రత్తలు తీసుకుంటున్నప్పటికీ పర్యాటకుల్లో అవగాహన లేనంతకాలం ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయని విశ్లేషకులు చెప్తున్నారు.

అనుమతి లేని వాహనాలను అడ్డుకున్న పోలీసులు

మార్టూరు, జూన్ 12 : చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బుధవారం ఒంగోలు వైపు నుంచి భారీగా టీడీపీ శ్రేణులకు చెందిన వాహనాలు విజయవాడ వైపు తరలివెళ్లాయి. మార్టూరు మండలంలో 120 పాసులను ఇచ్చారు. పాసులు లేనివారికి అనుమతి లేదని పోలీసులు ముందుకుగానే చెప్పారు. రాజుపాలెం రెస్ట్ ఏరియా వద్ద సీఐ రాజేశఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేశారు. ఈ నేపథ్యంలో చిత్తూరు, నెల్లూరు, కావలి, ఒంగోలు వైపు నుంచి వచ్చే వాహనాలలో చాలా మందికి పాసులు లేకపోవడంతో వారి వాహనాలను నిలిపివేశారు. దీనిపై శ్రేణులో పోలీసులతో వాదనకు దిగారు. దీంతో కొన్ని వాహనాలను పంపినా, మరికొన్నింటిని వెనక్కి పంపారు. మంగళగిరి వద్ద ట్రాఫిక్ నిలిచిపోవడంతో సాయంత్రం 4 గంటల వరకు రెస్ట్ ఏరియా నుంచి ప్రైవేటు వాహనాలను అనుమతించలేదు. దీంతో టీడీపీ శ్రేణులు పోలీసుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.

కేసరపల్లి సభ కీలక బాధ్యతల్లో సత్య

- అభినందించి ప్రధాని మోదీకి పరిచయం చేసిన చంద్రబాబు



ప్రధాని మోదీకి అభివాదం చేస్తున్న దామచర్ల సత్య

ఒంగోలు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన టీడీపీ యువనేత దామచర్ల సత్య బుధవారం కేసరిపల్లి వద్ద జరిగిన ఎన్‌డీఏ కూటమి మంత్రివర్గ ప్రమాణస్వీకార సభలో కీలకంగా వ్యవహరించారు. కొండపి నియోజకవర్గ టీడీపీ బాధ్యతలు అన్ని తానై చూసే సత్య రాష్ట్రస్థాయిలో యువనాయకుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. అధినేత నారా చంద్రబాబునాయుడు, యువనేత నారా లోకేష్‌లకు అత్యంత ఆత్మీయునిగా గుర్తింపు పొందిన సత్య, లోకేష్ యువగళం పాదయాత్ర ఏర్పాట్లలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రధానభూమిక పోషించారు. ఉత్తరాంధ్ర జోనల్ టీడీపీ ఇన్‌చార్జీగా అధినేత అప్పగించిన స్థాయిలో సమర్ధవంతంగా పనిచేసి గుర్తింపు పొందారు. ఒంగోలు మహానాడు నుంచి పార్టీలో సత్యకు ప్రత్యేక గుర్తింపు రాగా అప్పటి నుంచి రాష్ట్ర పార్టీ తరుపున ఎక్కడ ఏ సభ నిర్వహిస్తున్నా ఏర్పాట్లు పర్యవేక్షించే కీలక బాధ్యతలలో ఒకరిగా సత్యను అధినాయకత్వం పంపుతున్నారు. ఇలా చంద్రబాబు ప్రమాణస్వీకార సభ కార్యక్రమాల్లోనూ బాధ్యతలు ఇవ్వగా సమర్ధవంతంగా పనిచేశారు. ఆ సభకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరు కాగా చురుకుగా పనిచేస్తున్న యువనేత అంటూ సత్యను చంద్రబాబు ఆయనకు పరిచయం చేశారు.

టీడీపీ సంబరాలు



చంద్రబాబు జిందాబాద్ అంటూ నినాదాలు చేస్తున్న టీడీపీ శ్రేణులు

వేటపాలెం(చీరాల), జూన్ 12 : మండల పరిధిలోని దేశాయిపేటలో బుధవారం ముఖ్యమంత్రిగా టీడీపీ అధినేత చంద్రబాబు ప్రమాణ స్వీకారం నేపథ్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చిత్రపటాలతో, టీడీపీ జెండాలు చేతబూని చంద్రబాబు జిందాబాద్, సీఎం జిందాబాద్ అంటూ నినదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు నాశిక వీరభద్రయ్య తదితరులు మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో రాష్ట్రానికి పూర్వవైభవం, పురోభివృద్ధి వస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు చింతా రామకృష్ణారావు, వెంగళ భరత్‌బాబు, మా చర్ల సాంబశివరావు, పేరిసెట్ల శ్రీహరి, సజ్జ లెనిన్‌బాబు, కొప్పూరి శివారెడ్డి, నిమ్మని వెంకటపిచ్చయ్య, బుర్ర కవిత, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డీఎస్పీనంటూ ఘరానా మోసం ?

చీరాలటౌన్, జూన్ 12 : కుటుంబంలో వ్యక్తిని కోల్పోయి రోదిస్తున్న వారిని డీఎస్పీనంటూ గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి ఘరానా మోసం చేశాడు. ఈఘటన చీరాల మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కావూరివారిపాలెంకు చెందిన కాటి జయపాల్ గత ఆదివారం మిత్రులతో కలిసి రామాపురం సముద్రతీరంలో మునిగేందుకు వెళ్లి మృత్యువాత పడ్డాడు. అయితే దీంతో అతని పార్థివదేహానికి మంగళవారం అంతిమ సంస్కారాలు ముగిశాయి. అయితే అనూహ్యంగా సాయంత్రానికి గుర్తుతెలియని వ్యక్తి ఓ అధికారికి నేరుగా ఫోన్‌చేసి డీఎస్పీని మాట్లాడుతున్నానంటూ నమ్మపలికాడు. దీంతో ఆ ఘటనపై పూర్తి వివరాలు అందించారు. అంతవరకు బాగానే ఉంది. కానీ అదే వ్యక్తి తిరిగి బుధవారం నేరుగా బాధితులకు ఫోన్ చేశాడు. మృతి చెందిన వ్యక్తికి సంబంధించి రూ.7లక్షలు ఇన్సూరెన్స్ వస్తుందని మీరు అర్జెంట్‌గా రూ.18,470 ఆన్‌లైన్ పేమెంట్ చేయాలని మరో నంబర్ ఇచ్చాడు. దీంతో అమాయకులు వెంటనే నగదు పంపారు. అనంతరం ఈ విషయాన్ని ఆ అధికారి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆగ్రహించిన అధికారి ఆ నంబర్‌లకు ఫోన్ చేయడం ప్రారంభించారు. ఎన్నిసార్లు రింగ్ అవుతున్నా లిఫ్ట్ చేయకపోవడంతో మోసపోయినట్లు తెలుసుకుని ఈపూరుపాలెం పోలీసులను ఆశ్రయించారు. దీనిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఆన్‌లైన్ మోసమైతే కుటుంబంలో కుమారుడిని కోల్పోయిన సంగతి వారికి ఎలా తెలుసనే కోణంలో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

విద్యుదాఘాతానికి బాలుడు మృతి



మృతదేహంవద్ద విలపిస్తున్న అమ్మ భవాని

మార్టూరు, జూన్ 12 : విద్యుత్ షాక్ తగిలి అన్నం ప్రశాంత్ అనే 14 నెలల బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని డేగరమూడి రోడ్డు వద్ద ఇంటిలో జరిగింది. అన్నం దుర్గామల్లేశ్వరరావు భవాని దంపతుల చిన్నకుమారుడైన ప్రశాంత్ మంగళవారం ఉదయం ఇంటిలో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. నీళ్ల కోసం విద్యుత్ మోటారును వేసినపుడు ప్రశాంత్ ఆడుకుంటూ మోటార్‌ను పట్టుకోగా విద్యుత్ షాక్ తగిలింది. అనంతరం తల్లిదండ్రులు బాలుడిని తీసుకొని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం చిలకలూరిపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి చనిపోయాడు. బుధవారం బాలుని మృతదేహంవద్ద తల్లిదండ్రులు, బంధువులు విలపించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



చనిపోయిన ఏసుబాబు

మార్టూరు, జూన్ 12 : మండలంలోని ద్రోణాదుల గ్రామానికి చెందిన పంది ఏసుబాబు (38) అనే వ్యక్తి కోలలపూడి గ్రామంలో ద్విచక్రవాహనంపై వెళుతూ రోడ్డు ప్రక్కన ఉన్న రాతిదిమ్మెను ఢీకొని మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. ఏసుబాబుకు భార్య ప్రమీల, ఇద్దరు ఆడ పిల్లలు, అబ్బాయి ఉన్నారు. పోలీసులు తెలిపిన వివరాలివి. ఏసుబాబు పొగాకు పచ్చాకు పనులకు కూలీగా వెళుతుంటాడు. కోలలపూడి గ్రామంలో పచ్చాకు మేస్త్రి సుబ్బారావు ఇంట కార్యక్రమానికి మంగళవారం రాత్రి ఏసుబాబు ద్విచక్రవాహనంపై కోలలపూడి వెళ్లాడు. అక్కడ ఫంక్షన్ ముగించుకొని తిరిగి ద్రోణాదుల గ్రామానికి వస్తున్న సమయంలో కోలలపూడి ఎస్సీ కాలనీ వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి రాతి దిమ్మెను ఢీకొన్నది. కిందపడిన ఏసుబాబుపై ద్విచక్రవాహనం పడిపోయింది. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు ద్విచక్రవాహనాన్ని పక్కకు నెట్టి ఏసుబాబును బయటకుతీశారు. అయితే అప్పటికే ఏసుబాబు మృతి చెందారు. వెంటనే స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బుధవారం మేనమామ పల్లెపోగ జోబాబు ఫిర్యాదు మేరకు పోలీసులు శవపంచనామా చేసి మృతదేహానికి పోస్టుమార్టమ్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఏఎస్ఐ ఎం శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు.



ఆంధ్రజ్యోతి

గురువారం 13, జూన్ 2024 బాపట్ల 4 పేజీలు



కక్షలు,
కార్పణ్యాలు లేని రాజకీయం. ఎవరినీ
నొప్పించని.. ఆర్భాటాలు, హంగామాలకు పోని
మనస్తత్వం. అన్నింటికీ మించి ప్రజాసేవలో, అభివృద్ధి సాధనలో
అలుపెరుగని ప్రయాణం. ఇవే.. రాష్ట్రమంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను
రాజకీయ ఘనాపాటిగా నిలబెట్టాయి. తండ్రి చూపిన వ్యాపారం, పెదనాన్న
ఇచ్చిన రాజకీయ వారసత్వాలను దిగ్విజయంగా ముందుకు తీసుకెళ్లడంలో తనకు
తానే సాటిగా నిలిచారు. జగన్ ప్రభుత్వం వెంటాడి, వేటాడి ఆర్థిక మూలాలను
దెబ్బతీసినా తన యుక్తి, స్నేహితుల చేయూతతో ఎదురొడ్డి నిలబడ్డారు. పార్టీఏదైనా
ప్రజాబలమే ఆయుధంగా రాజకీయంగా నిలదొక్కుకున్నారు. అందుకే ఆనాడు టీడీపీ
నాయకత్వం ఏరికోరి అక్కున చేర్చుకుంది. ఆయన మనసెరిగి కాబోలు అడిగిన ప్రజాహిత
సేవలన్నింటికీ గత హయాంలో సీఎంగా చంద్రబాబు చేయూతనిచ్చారు. నాయకత్వమే కాదు..
మేమూ రవికుమార్ రాజకీయ సుగుణానికి జైకొడతామంటూ టీడీపీ కార్యకర్తలంతా
చేదోడుగా నిలిచారు. అందుకే గత ఎన్నికల్లో వీచిన ఎదురుగాలిలోనూ మంచి ఆధిక్యతతో
రవికుమార్ గెలుపొందారు. ఈ ఎన్నికల్లో అనుకూల వాతావరణంలో నియోజకవర్గ
చరిత్రలోనే కనీవినీ ఎరుగని మెజారిటీతో విజయం సాధించారు. అటు ప్రజాసేవ,
ఇటు పార్టీ విషయంలో నిబద్ధతతో పనిచేశారు. అవన్నీ గుర్తించే చంద్రబాబు..
నేడు తీవ్రమైన పోటీ ఉన్నప్పటికీ రవికుమార్ తన జట్టులో ఉండాలన్న
దృఢసంకల్పంతో మంత్రిని చేశారు. రాజకీయంగా రెండో దశలోకి
ప్రవేశించిన రవికుమార్ మరింత విజయవంతంగా
ముందడుగు వేయాలని ప్రజలు
ఆశిస్తున్నారు.

రాష్ట్ర మంత్రిగా
గొట్టిపాటి రవికుమార్
ప్రమాణ స్వీకారం
చేసిన సందర్భంగా
ప్రత్యేక సంచిక





నేడు యద్దనపూడిలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటన

యద్దనపూడి (మార్టూరు) జూన్ 12 : యద్దనపూడి గ్రామంలో గురువారం ఉదయం 9 గంటలకు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పర్యటిస్తారని పార్టీ శ్రేణులు బుధవారం ప్రకటనలో తెలిపారు.



అద్దంకి నుంచి తొలిసారి మంత్రిగా


మంత్రిగా ప్రమాణం చేస్తున్న గొట్టిపాటి రవికుమార్

- వరుసగా 5సార్లు విజయం
- అద్దంకి నుంచి 4సార్లు గెలుపొందిన రవికుమార్
- పెదనాన్న హనుమంతరావు ఆశయాలతో రాజకీయ ప్రవేశం

అద్దంకి, జూన్ 12 : అద్దంకి నియోజకవర్గం నుంచి తొలి మంత్రి పదవిని గొట్టిపాటి రవికుమార్ పొందారు. వరుసగా 5 సార్లు విజయం సాధించిన గొట్టిపాటి చంద్రబాబు మంత్రివర్గంలో స్థానం దక్కించుకున్నారు. స్వర్గీయ గొట్టిపాటి హనుమంతరావు ఆశయాలతో రాజకీయరంగ ప్రవేశం చేసిన రవికుమార్ 2004లో మార్టూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గొట్టిపాటి నర్సయ్యపై సుమారు 13,800 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. మార్టూరు నియోజకవర్గం రద్దు కావడంతో 2009లో అద్దంకి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నుంచి పోటీచేసి అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తిపై 15,700 ఓట్ల మెజార్టీతో గెలిచారు. వైఎస్ మరణాంతరం జగన్ వెంట నడిచిన రవికుమార్ 2014లో వైసీపీ తరపున కరణం కుమారుడు వెంకటేష్‌పై పోటీ చేసి సుమారు 4వేలకు పైగా మెజార్టీ తో గెలుపొందారు. అనంతరం మారిన రాజకీయ పరిణామాలతో 2015లో అప్పటి అధికారపార్టీ టీడీపీలో చేరారు. అప్పటి నుంచి టీడీపీలోనే ఉంటూ 2019లో టీడీపీ తరపున పోటీ చేసి బాచిన చెంచుగరటయ్యపై సుమారు 13 వేల మెజార్టీతో గెలుపొందారు. రాష్ట్రం మొత్తం వైసీపీ గాలి వీచినా అద్దంకి లో మాత్రం టీడీపీ తరపున గొట్టిపాటి విజయఢంకా మోగించారు. వైసీపీ నుంచి టీడీపీలోకి మారిన ఎమ్మెల్యేలలో రాష్ట్రం మొత్తమ్మీద 2019 ఎన్నికలలో ఒక్క గొట్టిపాటి రవికుమార్ మాత్రమే విజయం సాధించారు. వైసీపీ అధికారంలో ఉండడంతో గత 5 ఏళ్లుగా గొట్టిపాటిని అన్ని విధాలుగా ఇబ్బంది పెడుతూ ఆర్థిక మూలాలపై దెబ్బకొట్టినా బెదరకుండా నిలవడంతో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని అందరు టీడీపీ ఇన్‌చార్జిలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడంలో కీలకంగా వ్యవహరించారు. అదే సమయంలో మహానాడు నిర్వహణ, లోకేష్ యువగళం పాదయాత్ర సమయం లోనూ గొట్టిపాటి మార్కు కనిపించేలా బాధ్యతగా వ్యవహరించారు. దీంతో అటు చంద్రబాబు, ఇటు లోకేష్‌తో మరింత సాన్నిహిత్యం పెరిగి, వారి వద్ద ప్రత్యేక గుర్తింపు కూడా పొందారు. ఈ క్రమంలోనే కమ్మ సామాజికవర్గంలో పోటీ ఎక్కువగా ఉన్నప్పటికీ గొట్టిపాటికి మంత్రి పదవి దక్కిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అద్దంకి నియోజకవర్గ చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా గొట్టిపాటి సుమారు 25వేల ఓట్ల మెజార్టీని సాధించారు.

ఎదిగేకొద్దీ ఒదిగిన గొట్టిపాటి

- అందరివాడిగా గుర్తింపు
- ఫ్యాక్షన్ రాజకీయాలను రూపు మాపడంలో ప్రత్యేక స్థానం
- సోదరుడు కిషోర్‌బాబును పోగొట్టుకున్న బాధ
- అద్దంకి, మార్టూరు నియోజకవర్గాల్లో గొడవలను రూపుమాపిన రవికుమార్



అద్దంకి, జూన్ 12 : ఫ్యాక్షన్ రాజకీయాలను రూపుమాపడంలో గొట్టిపాటి రవికుమార్ సఫలీకృతులయ్యారనే భావన ప్రజలలో బలంగా నెలకొంది. ఫ్యాక్షన్ రాజకీయాలలో సోదరుడు కిషోర్‌బాబును పోగొట్టుకున్న బాధ తెలిసిన వ్యక్తిగా గొట్టిపాటి రవికుమార్ రాజకీయరంగ ప్రవేశం చేసినప్పటి నుంచి ఏఒక్క కుటుంబం ఫ్యాక్షన్ గొడవలతో ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో అడుగులు వేశారు. ఈక్రమంలో అద్దంకి, మార్టూరు నియోజకవర్గాలలో ఫ్యాక్షన్ గొడవలకు దూరంగా ఉంచడంలో సఫలీకృతులయ్యారనే చెప్పవచ్చు. రద్దయిన మార్టూరు నియోజకవర్గంతో పాటు అద్దంకి నియోజకవర్గంలోని పలు గ్రామాలలో ఫ్యాక్షన్ అల్లర్లలో పలు కుటుంబాలు ఛిన్నాభిన్నం అయ్యాయి. ప్రధానంగా సంతమాగులూరు, బల్లికురవ మండలాలలోని పలు గ్రామాలు ఫ్యాక్షన్ గొడవలు రగిలిపోయేవి. గొట్టిపాటి రవికుమార్ ఆ యా గ్రామాలలో రెండు వర్గాలను సమన్వయం చేయడం ద్వారా శాంతి కపోతాలను ఎగుర వేయించారు. రవికుమార్ కాంగ్రెస్ పార్టీ నుంచి వైసీపీ, వైసీపీ నుంచి టీడీపీలోకి మారినా తన వెంట నడిచిన నాయకులు, కార్యకర్తలను ఆయా పార్టీల నాయకులతో సమన్వయం చేసుకోవడంలో పూ ర్తి స్థాయిలో సఫలీకృతులయ్యారనే చెప్పవచ్చు. దీంతో ఒకప్పుడు ఫ్యాక్షన్ గొడవలతో రగిలిపోయిన గ్రామాలు ప్రస్తుతం శాంతిమా ర్గంలో నడుస్తున్నాయంటే దాని వెనుక గొట్టిపాటి చేసిన ప్రయత్నా లేనన్న భావన ప్రజలలో ఉంది. అదే సమయంలో తన వద్దకు పని మీద ఎవరు వెళ్లినా రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా చిరు నవ్వుతో పలుకరిస్తూ సమస్యను తన శక్తి మేర పరిష్కరిస్తారనే పేరు తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలోనే అందరివాడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఒక్క సారి గ్రామ, మండల స్థాయి పదవులు పొందితేనే ప్రత్యేక గుర్తింపు కోసం తాపత్రయ పడే నేటి సమాజంలో గొట్టిపాటి రవికుమార్ 5 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైనా సామాన్యుడిగా అందరితో కలిసి మెలసి ఉండడమే కార్యకర్తలలో ప్రత్యేక గుర్తింపు వచ్చే విధంగా చేసిందనే చెప్పవచ్చు.

చంద్రబాబు, గొట్టిపాటి కటౌట్‌కు పాలభిషేకం

అద్దంకి, జూన్ 12 : టీడీపీ ప్రభుత్వం ఏర్పడి మంత్రి మండలి ప్రమాణస్వీకారోత్సవ సమయంలో అద్దంకిలో శ్రేణులు పాలభిషేకం నిర్వహించారు. పట్టణంలోని భవానిసెంటర్‌లో సుమారు 70 అడుగుల చంద్రబాబు, గొట్టిపాటి రవికుమార్ భారీ కటౌట్‌ను ఏర్పాటు చేశారు. చంద్రబాబు ప్రమాణం చేసే సమయానికి ఆ కటౌట్‌లకు ఎక్స్‌వేటర్ సాయంతో టీడీపీ శ్రేణులు పాలభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కోనేటి అనిల్, కాకాని అశోక్, వడ్డవల్లి పూర్ణచంద్రరావు, ధూళిపాళ్ల హరీష్, తోకల రాజేష్, నాని, అహ్మద్, కడియం శ్రీను పాల్గొన్నారు.















ప్రజానేతకు శుభాకాంక్షలు
ఓటమి అంటే
తెలియని నేతగా
ప్రజల మనిషిగా
ముద్ర వేసుకొని
పార్టీ కోసం
అహర్నిశలు శ్రమించి
ముఖ్యమంత్రి
చంద్రబాబు గారి
ఆశీస్సులతో
అద్దంకి గడ్డపై
అఖండ విజయం
సాధించి
ప్రజల దీవెనలతో
రాష్ట్రమంత్రి గా
ప్రమాణస్వీకారం చేసిన
మా ప్రియతమ నేత
శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారికి
శుభాకాంక్షలు తెలియజేస్తూ
మీ...
శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు
రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు
కామేపల్లి లక్ష్మీప్రసాద్
శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారు
రాష్ట్ర మంత్రివర్యులు
కామేపల్లి ఎక్స్‌పోర్ట్స్ అండ్ గ్రానైట్స్, జొన్నతాళి, మార్టూరు మండలం


గొట్టిపాటికి అభినందనలు
అద్దంకి నియోజకవర్గంను
గొట్టిపాటి అడ్డాగా మార్చుకొని
వరుస విజయాలతో ముందుకు సాగుతూ...
పెద్ద నాన్న స్వర్గీయ గొట్టిపాటి హనుమంతరావు గారి
అడుగు జాడలలో నడుస్తూ...
అద్దంకి నియోజకవర్గ చరిత్రలోనే తొలిసారి
మంత్రి పదవి చేపట్టిన
శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారికి
అభినందన మందారమాల....
భవిష్యత్‌లో మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని
కోరుకుంటూ....
గొట్టిపాటి స్పెషాలిటి హాస్పిటల్స్ - అద్దంకి
డాక్టర్ వంశీకృష్ణ గొట్టిపాటి
M.S., జనరల్ సర్జన్
డాక్టర్ శ్రీలత కల్లూరి
M.S., OBG



సమర్థులకు సముచిత స్థానం!

చంద్రబాబు క్యాబినెట్‌లోకి పొంగూరు, ఆనం

జిల్లాలో మొత్తం స్థానాలను ఊడ్చేసి తెలుగు దేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు దోసిట పోసిన నెల్లూరుకు రాష్ట్ర క్యాబినెట్‌లో సముచిత స్థానం లభించింది. సమర్థులు, అభివృద్ధి కాముకులుగా గుర్తింపు పొందిన పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డిలకు మంత్రివర్గంలో చోటు దక్కింది. ఈ ఇద్దరు మంత్రు ల నేతృత్వంలో జిల్లా అభివృద్ధిబాట పట్టనుంది. సుదీర్ఘ కాలం తరువాత జిల్లా నుంచి ఇద్దరు నాయకులకు ఒకేసారి మంత్రివర్గంలో చోటు దక్కడం విశేషం. 2014లో తెలుగుదేశం క్యాబినె ట్‌లో తొలుత నారాయణకు ఒక్కరికే అవకాశం దక్కింది. మూడేళ్ల తరువాత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి మంత్రి పదవి దక్కింది. 2024 టీడీపీ క్యాబినెట్‌లో తొలి విడతలోనే నారాయణ, ఆనంలకు మంత్రి పదవులు దక్కడంతో చంద్రబాబు నెల్లూరు జిల్లా పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపినట్లుగానే టీడీపీ శ్రేణులు భావిస్తున్నాయి.

పొంగూరు నారాయణ అను నేను...

ఆనం రామనారాయణరెడ్డి అను నేను..

ఈ మాటలు ఈ ఇద్దరు అనడానికి, 'అనే' అవకాశాన్ని చేజిక్కించుకోవడానికి వారు చాలా పోరాటాలే చేశారు. వేధింపులను, వేదనలను, అవమానాలను ఎదుర్కొన్నారు. గడచిన ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో నారాయణ అనుభవించిన వేధింపులు అన్నీఇన్నీ కావు. వారానికో కేసు, నెలకో అరెస్టు వారెంటు, ఐటీ, విజిలెన్స్, పోలీస్ ఇలా రకరకాల శాఖల దాడులను ఎదుర్కొన్నారు. నారాయణను అరెస్టు చేసి జైలులో పెడితే చంద్రబాబును పెట్టినట్లే అనే భావన కాబోలు వైసీపీ ప్రభుత్వం నారాయణ మీద ఏదో ఒకవిధంగా కక్ష తీర్చుకోవడానికి ప్రయత్నించింది. అమరావతిలో అక్రమ ఆస్తులు సంపాదించుకున్నాడని నారాయణతోపాటు ఆయన బంధువులను వేధించారు. అమరావతి ఔటర్, ఇన్నర్ రింగ్‌రోడ్లలో అక్రమాలు జరిగాయంటూ కేసులు పెట్టారు. అరెస్టు వారెంట్లు తెచ్చారు. సోదాల పేరుతో మానసికంగా హింసించారు. పదవ తరగతి పరీక్షా పత్రాల లీకేజీ కేసులో నారాయణను ఇరికించడానికి శతవిధాల ప్రయత్నించారు. నారాయణ ఆసుపత్రిలో నకిలీ మందులు వాడుతున్నారని ఆయన నివాసాన్ని జల్లెడపట్టారు. నారాయణ స్కూలు బస్సుల కొనుగోళ్లలో అక్రమాలంటూ నారాయణ కార్యాలయాలతో పాటు అనుచరుల ఇళ్లపైనా పోలీసులు దాడులు చేశారు. ఎలాగైనా నారాయణను అరెస్టు చేయాలని ఆయన వాహనాన్ని ఎన్నోసార్లు వెంబడించారు.

● నెల్లూరు జిల్లా రాజకీయాలను కనుసైగతో శాసించిన కుటుంబానికి పెద్ద దిక్కు అయిన ఆనం రామనారాయణ రెడ్డి సైతం రాజకీయంగా పదేళ్లపాటు నరకం అనుభవించారు. కాంగ్రెస్ పతనంతో రాజకీయంగా నిలదొక్కుకోవడానికి పలు రకాల ప్రయాణాలు చేయాల్సిన పరిస్థితులను ఎదుర్కొన్నారు. ఇవన్నీ ఒక ఎత్తు అయితే అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉండి కూడా అదే ప్రభుత్వం ద్వారా పలు రకాల అవమానాలు ఎదుర్కొన్నారు. వెంకటగిరి ఎమ్మెల్యేగా కొనసాగుతున్న ఆనం రామనారాయణ రెడ్డికి వైసీపీ అధినేత జగన్ ఆ ఐదేళ్లలో ఏనాడు తగిన గౌరవం ఇవ్వలేదు. అంతేగాక ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే అవమానాలకు గురిచేశారు ఇదేం అన్యాయమని అడగాలని ప్రయత్నించినా అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా అవమానించారు. ఈ అవమానాలను భరించలేక వైసీపీ నుంచి వెలుపలకు వచ్చిన ఆనం రాజకీయంగా నిలదొక్కుకొనే క్రమంలో ఎంతో నలిగిపోయారు. టీడీపీకి ఏమాత్రం అనుకూలంగాలేని ఆత్మకూరులో పోటీ చేయాల్సి వచ్చినా ఆ నియోజకవర్గ ప్రజల మీద నమ్మకంతో బరిలోకి దిగారు. విజయం సాధించారు.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)



మంత్రులుగా ప్రమాణం చేస్తున్న నారాయణ, ఆనం



ఉదయగిరి రూరల్ : శివాలయంలో పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు

బడికి వేళాయె!

● నేడు స్కూళ్ల పునఃప్రారంభం

వేసవి సెలవులు పూర్తయిపోయాయి. మళ్లీ బడిగంట మోగనుంది. 52 రోజులపాటు ఆటపాటలతో గడిపిన చిన్నారులు గురువారం బడిబాట పట్టనున్నారు. నిన్నటిదాకా నిశబ్దం ఆవహించిన పాఠశాలలు ప్రార్థనా గీతాలతో సందడిగా మారనున్నాయి. నూతన విద్యా సంవత్సరం గురువారం ఆరంభం కానుండగా, ఎప్పటిలాగా ఈసారి కూడా విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలకనున్నాయి. విద్యారంగంలో అనేక మార్పులు చేపడుతున్నా మౌలిక సదుపాయాల కల్పనలో లోటు కనిపిస్తూనే ఉంది. ఓ వైపు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు హంగు, ఆర్భాటాలతో విస్తృత ప్రచారం చేస్తూ ఎక్కువశాతం మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తుండగా సర్కారు బడుల్లో వెన్నాడుతున్న సమస్యలతోనే కొట్టుమిట్టాడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు పనులతో అందంగా తీర్చిదిద్దుతున్నామని, నాణ్యమైన విద్యావిధానం అందచేస్తామని ప్రకటనలు చేస్తున్నా బడులు తెరిచే నాటికి ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి.

- నెల్లూరు (విద్య)



ఊరూరా సంబరం

● కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో కూటమి శ్రేణుల హుషారు

నెల్లూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో జిల్లావ్యాప్తంగా సందడి కనిపించింది. తెలుగుదేశం పార్టీ కార్యాలయాల వద్ద బాణాసంచా పేలుస్తూ, స్వీట్లు పంచుతూ సంబరాలు చేసుకున్నారు. పలుచోట్ల కేక్‌లు కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. బుధవారం గన్నవరం సమీపంలోని ఐటీ పార్కులో జరిగిన ముఖ్యమంత్రి, మంత్రులు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని ప్రజలు పెద్ద ఎత్తున తిలకించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఇళ్లలో టీవీలకు అతుక్కుపోయారు. ప్రభుత్వ పరంగా కూడా అధికారులు జిల్లావ్యాప్తంగా 12 చోట్ల భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేసి ప్రమాణస్వీకార కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని చూపించారు. కలెక్టరేట్ ఆవరణలోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ హరినారాయణన్, జాయింట్ కలెక్టర్ సేధుమాదవన్, కమిషనర్ వికాస్ మర్మత్, డీఆర్వో లవన్నలతోపాటు జిల్లా అధికారులు తదితరులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రులు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని వీక్షించారు. నెల్లూరులోని నర్తకీ సెంటర్‌లో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు, నగరాధ్యక్షుడు మామిడాల మధుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సంబరాలు జరిగాయి. కందుకూరులోని వెంగమాంబ కల్యాణ మండపం, కావలిలోని బృందావనం కల్యాణమండపం, ఆత్మకూరు రవితేజ కల్యాణ మండపం, బుచ్చిలోని ఎంఎం ఫంక్షన్ హాలు, వెంకటాచలంలోని శ్రిడ్స్ కల్యాణ మండపం, ఉదయగిరిలోని టీటీడీ కల్యాణ మండపాల్లో సీఎం ప్రమాణ స్వీకారాన్ని ప్రజలు, అధికారులు వీక్షించారు.



చంద్రబాబు ప్రమాణస్వీకారాన్ని వీక్షిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

మొగిలిచెర్లలో ఉద్రిక్తత!



ఘర్షణకు దిగిన టీడీపీ, వైసీపీ వర్గాలు

లింగసముద్రం, జూన్ 12 : మొగిలిచెర్ల గ్రామంలో బుధవారం టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య ఘర్షణ నెలకొంది. పరిస్థితి అదుపు తప్పేలా ఉండటంతో పోలీసులు లాఠీచార్జి చేసి, చెదరగొట్టారు. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు బాణాసంచా కాలుస్తూ వేడుకలు నిర్వహించారు. అయితే వైసీపీ నాయకుడు కొలికి కొండలరావు తన అనుచరులతో కలిసి తన ఇంటివద్ద బాణాసంచా కాల్చవద్దని అనడంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం జరిగి ఘర్షణకు దారితీసింది. దీంతో ఇరువర్గాలు రాళ్లతో దాడి చేసుకున్నాయి. విషయం తెలుసుకున్న లింగసముద్రం, వలేటివారిపాళెం ఎస్‌ఐలు బాజీబాబు, మహేంద్రనాయక్ అక్కడకు చేరుకుని స్పెషల్ పోలీసులు, పోలీసులు ఇరువర్గాలపై లాఠీచార్జీ చేసి చెదరగొట్టారు. దీంతో టీడీపీ, వైసీపీలకు చెందిన కొందరికి, ఒకరిద్దరు పోలీసులకు గాయాలయ్యాయి. కందుకూరు డీఎస్పీ ఎ శ్రీనివాస్ గ్రామానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అనంతరం గుడ్లూరు సీఐ బీవీ సుబ్బారావు, గుడ్లూరు ఎస్సై లక్ష్మణరావు, కందుకూరు రూరల్ ఎస్సై రమణయ్యలు, స్పెషల్ పోలీసులు కూడా గ్రామానికి చేరుకొని శాంతి భద్రతలను పర్యవేక్షిస్తున్నారు.

వాడవాడలా టీడీపీ సంబరాలు

● ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా చంద్రబాబు ప్రమాణ స్వీకారం వీక్షణ ● బాణాసంచా కాల్చి, కేకులు కట్ చేసి పంపిణీ


అల్లూరు : చంద్రబాబు ప్రమాణ స్వీకారం తిలకిస్తున్న బీద గిరిధర్, తదితరులు


కందుకూరు : కేకు కట్ చేస్తున్న నాయకులు


ఆత్మకూరు : బాణాసంచా కాల్చుతున్న శ్రేణులు

కావలి, జూన్ 12: రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు 4వ సారి, మంత్రులుగా పవన్‌కళ్యాణ్, లోకేష్ తదితరులు బుధవారం విజయవాడలో ప్రమాణ స్వీకారం చేయడంతో వాడవాడలా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు సంబరాలు జరుపుకున్నారు. ప్రమాణ స్వీకారోత్సవం ప్రారంభం నుంచి ముగింపు వరకు కావలి పట్టణంలోని పలు ప్రాంతాల్లో బాణసంచా మోత వినిపిస్తూనే ఉంది. బృందావనం హౌసింగ్ కాలనీ కల్యాణ మండపంలో కావలి మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రమాణ స్వీకారోత్సవాన్ని ప్రజలు, నేతలు వీక్షించారు. అలాగే పాతూరులో స్థానిక పాతూరు నాయకులే సొంత ఖర్చులతో ఎల్ఈడీ స్క్రీన్‌లతో ప్రమాణ స్వీకారోత్సవాన్ని ప్రజలు తికించే విధంగా ఏర్పాటు చేశారు. అక్కడే కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ట్రంకు రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలుగోళ్లమ్మపేటలోని మానస హాల్ సెంటర్‌లో అభిమానులు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. జనసేన ఆధ్వర్యంలో జనసైనికులు జనసేన, టీడీపీ జండాలతో పట్టణంలో మోటారుసైకిళ్ల ర్యాలీ నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అలాగే పట్టణంలోని ఒంగోలు బస్టాండ్‌లోని పాదర్తి దుకాణం దగ్గర వామ్ కావలి మహిళా విభాగం ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద కావలి వాసవి, సెవెన్‌లైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కర్నాటి సుబ్బారావు, అనుమలిశెట్టి వాసు, గాదంశెట్టి వేణు, పాదర్తి నాగరాజు, తిరువీది ప్రసాద్, ఏల్చూరి రవి, పెట్లుగాని రమేష్, ఓరుగంటి రామకృష్ణ, గుర్రం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : రాష్ట్రంలో చంద్రబాబునాయుడు సారథ్యంలోని నూతన ప్రభుత్వం కొలువుదీరిన వేళ కందుకూరు ప్రాంతంలో వాడవాడలా సంబరాలు మిన్నంటాయి. ప్రజలంతా టీవీలలో, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్‌ల వద్ద చంద్రబాబునాయుడు, మంత్రివర్గం ప్రమాణస్వీకార మహోత్సవాన్ని వీక్షించారు. ఎక్కడికక్కడ పెద్దఎత్తున బాణసంచా కాల్చుతూ స్వీట్లు పంచిపెట్టారు. పలు గ్రామాల్లో, పట్టణంలోని పలు ప్రాంతాలలో ప్రమాణస్వీకార మహోత్సవం జరుగుతున్నంతసేపు బాణసంచా కాలుస్తూ యువకులు తమ ఆనందాన్ని పంచుకున్నారు. పట్టణంలోని వెంగమాంబ ఫంక్షన్‌హాలులో ప్రజలు వీక్షించేందుకు వీలుగా ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. ప్రమాణస్వీకారోత్సవం అనంతరం ఫంక్షన్‌హాలు వెలుపల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున బాణసంచా కాల్చారు. పట్టణంలోని 21వ వార్డులో స్థానిక టీడీపీ నాయకులు పతకమూరి వరప్రసాదరావు, చెరువుగట్టు బ్రహ్మయ్య, పి.అనీల్‌ల ఆధ్వర్యంలో టీడీపీ బీసీసెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ చిలకపాటి మధుబాబు కేకు కట్‌చేసి బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

అల్లూరు : తెలుగుదేశం, జనసేన. బీజేపీల ప్రతి కార్యకర్త కష్ట ఫలమే ఎన్డీఏ విజయానికి కారణమయ్యాయని నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా, పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారాన్ని తిలకించేందుకు స్థానిక వైఎస్సార్ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో ఎల్ఈడీ ఏర్పాటు చేశారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి తిలకించారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్‌చేసి కేకు, మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బండి శ్రీనివాసులు రెడ్డి, పలగాటి శ్రీనివాసులు రెడ్డి, బుల్లా కృష్ణారెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, అరగల రమణయ్య, హరూన్ రషీద్, రాయి నాయుడు, రేబాల శంకర్‌రెడ్డి, తిరువీది అనురాధ, ఊటు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లింగసముద్రం : రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా స్థానిక టీడీపీ కార్యలయం వద్ద టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్, మండల తెలుగు యువత అధ్యక్షుడు అడపా రంగయ్య, జి బాలనారాయణ, నీలం బ్రహ్మారెడ్డి, పార్టీ కార్యకర్తలు, నాయకులు బాణాసంచా కాల్చి తమ ఆనందోత్సాహాలను వ్యక్తం చేశారు. కేక్ కట్ చేసి పలువురికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఉపాధ్యక్షుడు అడపా నర్సయ్య, మక్కెన మల్లికార్జున, పరేష్ తదితరులు పాల్గొన్నారు.

కలిగిరి : ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారాన్ని పురస్కరించుకొని పట్టణంలోని కలిగిరమ్మ కూడలి ప్రాంతంలో బాణసంచా పేల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు ఊసా మాల్యాద్రి, ఎన్ ప్రభాకరరావు, కాకు మహేష్, స్వర్ణ కొండయ్య, లెక్కల రాంబాబు, నిశ్శంకర సురేష్, జిర్రా చినఅంకిరెడ్డి, పెదఅంకిరెడ్డి, కాకు మహేష్, ఓబయ్య, కె.వెంకట్రావు, బీ.మల్లికార్జున, రవీంద్ర, భాస్కరాచారి, రామయ్య, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం : చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం సందర్భంగా మండలంలోని సాయిపేట పంచాయతీ ఎస్సీకాలనీలో, వెల్లటూరివారిపాలెంలో కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టి బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. గుడవల్లూరు, తూర్పుపాలెం, తూర్పుఎర్రబల్లి తదితర అన్ని గ్రామాలల్లోనూ కేకులు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

బిట్రగుంట : ముఖ్యంత్రిగా చంద్రబాబు, పలువురు మంత్రులు ప్రమాణ స్వీకారం సందర్భంగా బోగోలు మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. బోగోలు కూడలిలోని బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బజారు కూడల్లో బాణాసంచా కాల్చారు. రైల్వే ఎల్సీగేట్ 144 పడమర గిరిజన నాయకుడు బోగిరి ప్రభాకర్, యోహానులు తమ సొంత నిధులతో ప్రమాణ స్వీకారాని వీక్షించేందుకు భారీ ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, మాజీ ఎంపీటీసీ చిలకపాటి వెంకటేశ్వర్లు, బీజేపీ మండల అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్, మాజీ సర్పంచు దొడ్ల అంజయ్య, మాజీ ఎంపీపీ పొశం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ముంగమూరులో యన్నాబత్తిన వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నూతన ప్రభుత్వాని చల్లంగా చూడమని పోలేరమ్మకు ప్రత్యేక పూజలు, గ్రామంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.


కావలి : పాతూరులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ...


కొండాపురం : వెల్లటూరివారిపాలెంలో....


బిట్రగుంట : ప్రమాణ స్వీకారం వీక్షిస్తున్న శ్రేణులు

వలేటివారిపాలెం : చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారోత్సవం సందర్భంగా మండలంలోని బడేవారిపాలెంలో టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. పూలు, రంగులు చల్లుకుంటూ భారీ ర్యాలీ నిర్వహించారు. యువత డ్యాన్సులు చేస్తూ కేరింతలు కొట్టారు. అనంతరం ఎమ్మెల్యే నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య తమ మహిళా కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. జై తెలుగుదేశం జై చంద్రబాబు, జై నాగేశ్వరావు అంటూ నినాదాలతో హోరెత్తించారు.

ఆత్మకూరు : నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి విజయం సాధించడంతో పాటు ముఖ్యమంత్రిగా చంద్రబాబు మంత్రి వర్గంలో రాష్ట్ర మంత్రి పదవి వరించడంతో టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలు బుధవారం సంబరాల్లో మునిగితేలారు. పలు ప్రాంతాల్లో కేక్ కట్ చేసి బాణాసంచా పేల్చి స్వీట్లు పంచిపెట్టారు. పట్టణంలోని ఆర్యవైశ్య ప్రధాన వీధిలో టీడీపీ శ్రేణులు బాణాసంచా పేల్చారు. తోట సుబ్బారావు ఆధ్వర్యంలో మిఠాయిలు పంచి పెట్టారు. జేఆర్‌పేటలోని 4వ వార్డులో, 20వ వార్డులో మున్సిపల్ కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

సంగం : మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు బుధవారం ఘనంగా సంబరాలు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం కొలువు దీరి నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా, పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎంగా, ఆనం రామనారాయణరెడ్డి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఈ సంబరాలు చేసుకున్నారు. అందులో భాగంగా టీడీపీ సీనియర్ నాయకులు కోటు వెంకట కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అలాగే తలుపూరుపాడులో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి షేక్ బాబు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సంగం బస్టాండ్‌లో కర్నాటి చరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి బాణాసంచి కాల్చి సంబరాలు చేసుకున్నారు. కలువాయిలో టీడీపీ శ్రేణులు సంబరాలు.

కలువాయి: రాష్ట్ర ముఖ్యమంత్రిగా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం సందర్భంగా కలువాయిలో టీడీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు చల్లా రఘురామిరెడ్డి, చల్లా బుజ్జిరెడ్డి, గడ్డం కిషోర్ రెడ్డి, దండు పెంచలయ్య, ఎన్.నరసింహులు యాదవ్, పిడుగు శ్రీనివాసులురెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంతసాగరం : నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా, ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో సాగరంలో టీడీపీ శ్రేణులు సంబరాల్లో మునిగితేలారు. బాణాసంచా కాల్చి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. టీడీపీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో చల్లా శివారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, కే తిరుపతినాయుడు, బి జగన్మోహన్‌రెడ్డి, మనోహర్, పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం : చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా బస్టాండ్ సెంటర్‌లో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, బాణాసంచా కాల్చి స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో సీతారామపురం సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి, సీనియర్ నాయకులు ఎస్కే బాబు, పిడుగు జయరాములు, దేవర వెంకటేశ్వరు, 8 బూత్ ఇంచార్జి తోట మాల్యాద్రి, 7 వార్డు సెంబర్ తోట మనోజ్ బాబు, బోగినేని కాశిరత్తయ్య, తోట నవీన్ కుమార్, తోట ఏడుకొండలు, తోట లక్ష్మయ్య, గురుమూర్తి, పవన్, కొత్త జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్ : ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేయడంతో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశానుసారం టీడీపీ మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చేపట్టిన సంబరాలు అంబరాన్నంటాయి. అలాగే పంచాయతీ బస్టాండ్ సెంటర్ నుంచి మెయిన్ బజార్‌లోని శివాలయం వరకు నినాదాలతో కూడిన ర్యాలీ చేపట్టారు. అనంతరం శివాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి 101 టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, ఓబులరెడ్డి, నరసింహా, సందానీ, సజిల్, మాబాషా, ఖాన్‌షా, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


వలేటివారిపాలెం : కేక్ కట్ చేస్తున్న సౌజన్య


కావలి : మజ్జిగ, స్వీట్లు పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్యులు


అనంతసాగరం : కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు


సీతారామాపురం : బాణాసంచా కాలుస్తున్న తెలుగు యువత నాయకులు

రాష్ట్ర మంత్రి ఆనంకు అభినందన వెల్లువ



రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి అభినందనలు తెలుపుతున్న ఆత్మకూరు టీడీపీ నేతలు

ఆత్మకూరు, జూన్ 12 : రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఆనం రామనారాయణరెడ్డికి అభినందనలు వెల్లువెత్తాయి. రాష్ట్ర మంత్రివర్గ ప్రమాణస్వీకారానికి నియోజకవర్గం నుంచి టీడీపీ కూటమి నేతలు గన్నవరం విమానాశ్రయంలోని కేసరపల్లికి తరలివెళ్లారు. రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఆనంను పలువురు నేతలు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, రూరల్ అధ్యక్ష కార్యదర్శులు సుంకర పెంచలచౌదరి, కేతా విజయభస్కర్‌రెడ్డి, తెలుగు యువత జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, మండల తెలుగు యువత అధ్యక్షుడు తలచీరు బాబునాయుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కొల్లి నరసపు నాయుడు ఆనం రామనారాయణరెడ్డిని సన్మానించారు.

సంగం : నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రి వర్గంలో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డికి స్థానిక టీడీపీ నాయకులు అమరావతికి వెళ్లి బుధవారం పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆనం ప్రసాద్‌రెడ్డి, కర్నాటి రవీంద్రరెడ్డి, సూరా శ్రీనివాసులురెడ్డి, పగడాల రఘురామయ్య, మండల పార్టీ కన్వీనర్ జి శ్రీనివాసులు యాదవ్, మహిళా నాయకురాలు కే. మంజులనాయుడు, వేణుబాలు తదితర నాయకులు ఉన్నారు.

సోషల్ రిఫార్మర్ల ఆత్మీయ కలయిక

కావలిటౌన్, జూన్ 12: స్వచ్ఛంద సేవాసంస్థల నిర్వాహకులు ఒకే వేదికగా ఏర్పాటు చేసుకున్న సోషల్ రిఫార్మర్స్ సభ్యుల ఆత్మీయ కలయిక బుధవారం రెడ్‌క్రాస్ సమావేశ మందిరంలో జరిగింది. స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే కార్యక్రమాలపై సమీక్షించారు. ఆయా సంస్థలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి చేపట్టవలసిన చర్యలు, భవిష్యత్‌లో నిర్వహించనున్న కార్యక్రమాలపై ప్రణాళిక రూపొందించారు. ఈ సమావేశంలో డాక్టర్ చేవూరు చిన్న, రాయపాటి దిలీప్, షేక్ రఫీ, మొగల్ సలీం బేగ్, మారుతిరావు, రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఉలవపాడు, జూన్ 12 : వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తహసీల్దారు చంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి ఆధ్వర్యంలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ప్రతి అధికారి పాల్గొనే ఈ వేదికపై సమస్యలను అర్జీల రూపంలో స్వీకరిస్తారని పేర్కొన్నారు. వేదిక సమీపంలోనే ఆధార్ సేవా కేంద్రం, లీగల్ సెల్ ఏర్పాటు చేయున్నట్లు తెలిపారు. నూతన ఆధార్, సవరణలతోపాటు లీగల్ సెల్ నందు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్, నలుగురు న్యాయవాదులు పాల్గొంటారని, మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అర్జీల స్వీకరణ రేపటికి వాయిదా

వలేటివారిపాలెం, జూన్ 12 : వలేటివారిపాలెం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరగవలసిన అర్జీల స్వీకరణ కార్యక్రమం అనివార్యక కారణాల వలన శుక్రవారానికి వాయిదా వేసినట్లు తహసీల్దారు నాగమల్లేశ్వరావు, ఎంపీడీవో రఫీక్‌అహ్మద్ బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు.

లేగదూడులకు వ్యాధి నివారణకు వ్యాక్సిన్

కొండాపురం, జూన్ 12: తొలకరి చినుకులు సమయంలో పచ్చిక పట్టడం వలన లేగదూడలకు వ్యాధులు సంక్రమించకుండా పశువైద్యశాఖ సిబ్బంది బుధవారం పచ్చిక దొమ్మ వ్యాక్సిన్ వేశారు. సాయిపేట పశువైద్యాధికారి మధు ఆదేశాల మేరకు పార్లపల్లి పశువైద్య సహాయకుడు శీలం శ్రీనివాసులు, సాయిపేట పశువైద్య సహాయకురాలు బొడ్డు ఖ్యాతిలు భీమవరప్పాడు గ్రామంలోని 4 నెలల నుంచి 3 ఏళ్ల వయస్సుగల 102 లేగదూడలకు వ్యాక్సిన్ వేశారు.

వైభవంగా పోలేరమ్మ గ్రామోత్సవం



బిట్రగుంట, జూన్ 12: బోగోలు మండలం కోవూరుపల్లి పంచాయతీ గిరిజన కాలనీలో వెలసి ఉన్న పోలేరమ్మ గ్రామ పొంగళ్ల కార్యక్రమంలో భాగంగా రెండో రోజు బుధవారం అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. పోలేరమ్మ అశ్వవాహనంపై గజమాలతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో రామోహన్‌రెడ్డి, నిరంజన్ రెడ్డి, నాటకరాణి భాస్కర్, రంగయ్య, తిరుపతి, శీనయ్యలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎన్నారై కోఆర్డినేటర్‌కు చంద్రబాబు ప్రశంసలు

కావలిటౌన్, జూన్ 12: టార్గెట్ 2024లో భాగంగా అమెరికాలోని సెయిట్ లూయిస్ సిటీ ఎన్నారై టీడీపీ కోఆర్డినేటర్ మన్నవ తేజ్‌బాబును అమెరికాలోని మిస్సోరి స్టేట్ సెయింట్ లూయిస్ సిటీలో టీడీపీ ఎన్నారై సెల్ ఆధ్వర్యంలో చంద్రబాబునాయుడు పంపిన ప్రశంసాపత్రంతో మంగళవారం రాత్రి ఘనంగా సత్కరించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మన్నవ రవిచంద్ర కుమారుడైన తేజ్‌బాబు మాట్లాడుతూ టార్గెట్ 2024ను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ముందుకెళ్లామన్నారు. టీడీపీ ఎన్నారై యాప్ ద్వారా సమర్థవంతంగా విధులు నిర్వహించి టీడీపీ గెలుపునకు కృషి చేశామన్నారు. తన సేవలను గుర్తించిన చంద్రబాబు నాయుడు చరవాణి ద్వారా అభినందించడంతోపాటు ప్రశంసాపత్రాన్ని పంపించడం సంతోషంగా ఉందన్నారు.


చంద్రబాబు పంపిన ప్రశంసాపత్రంతో తేజ్‌బాబు

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

అల్లూరు, జూన్ 12 : అల్లూరు కోనేరు సెంటరులో వెలసి ఉన్న అభయాంజనేయస్వామి పుష్కరిణి క్షేత్రం సప్త వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. క్షేత్రం నుంచి అల్లూరు ప్రధాన రహదారిలో యువకులు ద్విచక్ర వాహనాలపై కాషాయ రంగు జెండాలను అలంకరింపజేసి కాషాయ దుస్తులతో జై శ్రీరామ్.. జై హనుమాన్.. నినాదాలతో యాత్ర కొనసాగించారు. అల్లూరులో మొట్టమొదటిగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రతి ఏటా కొనసాగిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. కావలి రూరల్ సీఐ నాగభూషణం, అల్లూరు ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో దమ్మాల వెంకట బ్రహ్మానందరావు, పిట్టల కమలాకర్, కారుమంచి కార్తీక్ శర్మ, నారాయణ స్వామి, పొన్నపూడి శ్రీనివాసులు, శివ, కళ్యాణ్, పోలయ్య, మునిరాజా, శ్రీకాంత్ పాల్గొన్నారు.


అల్లూరులో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

మీ పిల్లలను జడ్పీ హైస్కూల్‌లో చేర్పించండి


జడ్పీ హైస్కూల్‌లో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరుతున్న హెచ్ఎం

లింగసముద్రం, జూన్ 12 : అన్ని వసతులున్న లింగసముద్రంలోని కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో తమ పిల్లలను చేర్పించాలని ప్రధానోపాధ్యాయుడు ఉమ్మడిశెట్టి మాధవరావు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులను కోరారు. బుధవారం లింగసముద్రంలో హెచ్ఎం మాధవరావు, ఉపాధ్యాయులు ఇంటింటికి తిరిగి హైస్కూల్‌లో విద్యార్థులకు లభించే సౌకర్యాలు గురించి వివరించారు. హైస్కూల్‌లో పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులు, ఐఎఫ్‌పీ ప్యానెల్, ట్యాబులు, విశాలమైన ఆటస్థలం వంటి వసతులు ఉన్నాయన్నారు. ఉచిత పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, ఉచిత యూనిఫాం ఇస్తారని, పాఠశాలకు అనుబంధంగా మూడు వసతి గృహాలు ఉన్నాయని చెప్పారు. ల్యాబ్ సౌకర్యం, ఎన్ఎంఎంఎస్‌కు ప్రత్యేక శిక్షణ, స్టడీ అవర్స్ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం కొండయ్య, ఎ నారాయణ, కె ప్రభాకర్, కె వెంకటేశ్వర్లు, టివివి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూన్ 12: స్థానిక ఆదర్శ పాఠశాలలో 7, 8, 9వ తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సైమన్‌రావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 15వ తేదీ సాయంత్రం 4 గంటల్లోపు దరఖాస్తులను పాఠశాలలో అందజేయాలని, ప్రవేశ పరీక్ష ద్వారా సీట్లను భర్తీ చేస్తామన్నారు. ప్రవేశ పరీక్ష ఈనెల 20న ఉదయం 10 గంటలకు నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఘనంగా చర్చి వార్షికోత్సవం

ఉదయగిరి రూరల్, జూన్ 12: మండలంలోని నేలటూరి పంచాయతీ సర్వరాబాదు తెలుగు చర్చి పదో వార్షికోత్సవం సంఘకాపరి డాక్టర్ కొంగలేటి జయరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం బైబిల్ సందేశాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో పాస్టర్ లాజర్ఏసుదాసు, సంఘపెద్ద గొల్లపల్లి సాల్మన్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల తనిఖీ

ఉదయగిరి, జూన్ 12: పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలను బుధవారం ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అధికారులు తనిఖీ చేపట్టారు. హోలీఏంజల్స్, సెంట్‌మేరీ, సాధన పాఠశాలల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలకేశవులు, కృష్ణంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివరామిరెడ్డి రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకే పాఠశాలలను నిర్వహించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

ఉదయగిరి, జూన్ 12: మండలంలోని వెంకట్రావుపల్లిలో మంగళవారం అర్ధరాత్రి పెద్ద ప్రమాదం తప్పింది. గాలివానకి దుగ్గినబోయిన నాగేశ్వరరావు ఇంటి ఎదురుగా మెయిన్‌లైన్ విద్యుత్ తీగ ఉన్నట్లుండి తెగిపడింది. ఆ సమయంలో జనసంచారం లేకపోవడంతో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. విద్యుత్ తీగ తెగిపడడంతో గ్రామంలో అంధకారం నెలకొంది. ఎన్నిసార్లు లైన్‌మెన్‌కు ఫోన్ చేసినా స్పందించలేదని గ్రామస్తులు తెలిపారు.

పేదలకు చీరల పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

ఉదయగిరి రూరల్, జూన్ 12: రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేసినందుకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, మన ఫౌండేషన్ అధినేత మన్నేటి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు గాజుల బాబు, మున్నా పేదలకు చీరలు పంపిణీ చేశారు. మెట్ట ప్రాంతమైన ఉదయగిరి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ల ఆధ్వర్యంలో అభివృద్ధి దిశగా పయనిస్తుందని ఆశిస్తున్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు గూడూరు వెంకటేశ్వరరావు, మట్ల లక్ష్మయ్య, అర్షద్, శ్రావణ్, రవి, రమణయ్య, ప్రసాద్, మహేష్, సమీ, జిలానీ, అస్లామ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

ఉదయగిరి, జూన్ 12: మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు బుధవారం ఎంఈవో-2 తోట శ్రీనివాసులు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. మండలంలోని 1 నుంచి 5వ తరగతులకు 9,610, అలాగే 7, 8, 9వ తరగతులకు 13,064 పుస్తకాలను అందజేశామన్నారు. విద్యార్థులకు బ్యాగులు, బెల్ట్‌లు, సాక్సులు రావాల్సి ఉందని ఆయన తెలిపారు.

స్టూడెంట్ కిట్ల సరఫరా

వరికుంటపాడు : విద్యా సంవత్సరానికి ముందుగానే నూతన ప్రభుత్వం విద్యార్థులకు అవసరమైన స్టూడెంట్ కిట్లను మండలానికి సరఫరా చేసింది. అందులో భాగంగా యూనిఫాం, నోట్ పుస్తకాలను అందజేసింది. తొలి విడతగా 8,10 తరగతులకు ఫిజిక్స్ పుస్తకాలు మినహా మిగిలిన 13,340 పుస్తకాలను స్టాక్ పాయింట్‌కు తరలించారు.